₹ 10/-


జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి- 8 సంచిక - 11

పక్షపత్రిక జూన్ 1-15, 2017

## అక్టోబర్‌లో తెలంగాణ తొలి 'ప్రపంచ తెలుగు మహాసభలు'





## సర్వే ఏదైనా సారాంశం ఒక్కటే... 80శాతం పిల్లలకు అధ్వాన్న స్కూలు చదువుల నేరపాలనే!



## ప్రాంతీయ మండళ్లు +: ఉత్తరాంధ్ర వృద్ధికి జేపీ ఫార్ములా



తాను చదువుకున్న
గొడవర్రు (కృష్ణా జిల్లా)
పాఠశాలను సందర్శించి
విద్యార్థులకు బెంచీలను
బహూకరించిన సందర్భంలో
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు
డా॥ జయప్రకాష్ నారాయణ్,
లోక్‌సత్తా పార్టీ నేతలు కూడా
ఈ కార్యక్రమంలో
పాల్గొన్నారు.



జన రాజకీయం కోసం...

లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూన్ 1-15, 2017

సంపుటి - 8 సంచిక - 11

## లోపలి పేజీల్లో...

2016-17 లోనూ అదే నేరపూరిత.....5

నాసిరకంలో పోటీపడుతున్న ............. 8

ఏపీలో డబ్బున్నవారికే మంచి ...............14

బడిచదువుల్లో రెడ్‌జోన్‌లో ................ 15

నిరుద్యోగానికి బీజం ...................... 16

విస్తరిస్తోన్న షాడో విద్య .................... 17

వాసిగల ఉపాధ్యాయులేరి................ 19

హేతువు వికసిస్తేనే విజ్ఞాన భారతం...... 21

చిన్నారులకు కూడా ఇంత చక్కగా....... 23

రామాయపట్నాన్ని రాకుండా.............. 29

ఆర్టీసి చట్టాన్ని వెంటనే తెండీ ..............30

విభజన హామీలన్నిటినీ నెరవేర్చాల్సిందే....31

ప్రాంతీయ మండళ్ళు..........................32

ధర్నాచౌక్‌పై సర్కారు తీరును...............34

సంపాదక వర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

సంపాదక వర్గం

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి. కుటుంబరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి

# సంకెళ్లలోనే భవిష్యత్ భారతం




ఈవేళ్టని చిన్నచూపు చేసేవారు, రేపటి గురించి భయపడేవాళ్లు చాలామందే కనిపిస్తుంటారు. కానీ గతంలోని ప్రతిదీ అందమైనది కాదు, మానవాళి పురోభివృద్ధిని సాధిస్తూనే వస్తోంది, మరే తరంలోనూ లేనన్ని గొప్ప అవకాశాలు ఈరోజు మానవజాతికి ఉన్నాయి .. అన్నదే వాస్తవం! గతంలో మనవాళ్లు కాలుష్యరహితంగా రుచికరమైన, బలవర్ధకమైన ఆహారాన్ని తిని ఉండొచ్చు, కానీ ఆ రోజుల్లో ఆ అవకాశం చాలా కొద్దిమందికే ఉండేది. మిగిలినవారంతా మిగిలిపోయిన ఆహారం మీదే బతికేవారు. బతకటం కోసం చనిపోయిన జంతు కళేబరాలను కూడా తినేవారు. అదంతే అంటూ.. పుట్టుకను బట్టి కొందరికే అవకాశాల సిద్ధాంతాన్ని మనదేశంలో నమ్మటం, నమ్మించటం మొదలుపెట్టాం. ఒక వర్గానికి మేలు జరిగితే, మరో వర్గానికి నష్టం తప్పదనే 'జీరో సమ్' పద్ధతినే రాజకీయాలలో, సమాజంలో అనుసరిస్తూ వచ్చాం. కానీ ఆధునిక ప్రజాస్వామిక దశ వచ్చాక, సాంకేతిక పురోగమనం మొదలయ్యాక.. కొద్దిశాతం మందికి మాత్రమే ఉన్న ఆహారాన్ని, అవకాశాల్ని అందరికీ అందించే అవకాశం ఉందనే వాస్తవం స్పష్టమైంది. కానీ ఇందుకోసం 'పరిమిత ఉదారత్వ సాంప్రదాయ దృక్పథాలకు - అందరికీ ఎదిగే అవకాశాలను అందించాలనే ఉదార విలువలకు' మధ్య సంధానానికి కొన్ని విధానాలు, వ్యవస్థలు అవసరమయ్యాయి. ఆ విధంగానే రాజ్యాంగం, చట్టాలు వంటివి ఏర్పాటు చేసుకున్నాం. నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించే ఎజెండాను రూపొందించుకున్నాం. కానీ ఇవేవీ అక్కర్లేకుండా.. గతమే సర్వస్వం అని నమ్మిస్తూ, పుట్టుకతో కుల,మత వివక్షలు మామూలే అనే ధోరణితోనే వ్యవహరిస్తుండటం, అలాంటివారే ఎన్నికలలో నెగ్గి యధాతథ స్థితిని కొనసాగిస్తుండటం వల్ల.. మనదేశం కొన్ని తరాలుగా విలువైన అవకాశాలను కోల్పోతూ వస్తోంది. ఎంత అత్యాధునిక సాంకేతికతను జోడించినా.. సరైన వ్యవస్థలకు, విధానాలకు పాత, పరిమిత ధోరణులు ప్రత్యామ్నాయం కాదని తాజా పాలకులు కూడా గుర్తించటం లేదు. సమాజంలో డబ్బున్న కొద్దిశాతానికి మినహాయించి, అత్యధికులకు మంచి చదువు అందకుండా చేస్తున్నారు. బిడ్డ ఎదగటానికి కీలకమైన మంచి ప్రమాణాల పాఠశాల విద్య ఇప్పటికీ ఎండమావిగానే ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు, దేశీయ, అంతర్జాతీయ తేడా లేకుండా ఏ సర్వేనైనా తీసుకోండి - మనదేశంలో స్కూలు చదువులు అధ్వాన్నంగా ఉన్నాయన్నదే సారాంశం! ఎనభై శాతం మంది పిల్లలకు పనికిమాలిన చదువును అందించే నేరపాలన సాగిస్తున్నారు. కొద్దిమందికి కొద్దిపాటి అవకాశాలను తాత్కాలికంగా ఇచ్చే రిజర్వేషన్లతో ఓటు బ్యాంకు చేస్తూ.. అందరికీ అపరిమిత అవకాశాలనిచ్చే నాణ్యమైన విద్యను ఎగ్గొడుతున్నారు. అనుకూలంగానైనా, వ్యతిరేకంగానైనా రాజ్యవ్యవస్థ పాత్రను అతిగా ఊహించుకోనక్కర్లేదు కానీ.. నాణ్యమైన విద్యను ప్రతి బిడ్డకూ అందించాల్సిన పని ప్రభుత్వానిదే! ప్రతిదానికీ ఆధార్ అనుసంధానం, మీ శరీరం మీద మీకు హక్కులు లేవనే వాదనలు, చట్టబద్ధ పాలన సక్రమంగా అమలుచేయకపోవటం వల్ల అన్యాయాలకు మౌనాంగీకారం, పెద్ద నోట్ల రద్దు పేరుతో మన డబ్బును మనకివ్వకుండా వేధించటం వంటి వాటన్నిటికన్నా.. అధ్వాన్న చదువుతో దేశంలోని కోట్లాది బిడ్డలకు వికసించే అవకాశాలు లేకుండా చేయటం స్వేచ్ఛకు అతి పెద్ద గొడ్డలిపెట్టు. స్వతంత్రం వచ్చిన నాటి నుంచీ ప్రతి భవిష్యత్ భారత తరంలోనూ అత్యధికులు ఎదిగే అవకాశాలు లేక సంకెళ్లలోనే ఉంటే, ఇక స్వేచ్ఛ ఏమిటి? దేశ సుస్థిరాభివృద్ధి ఏ రకంగా?. నీతి ఆయోగ్ కూడా ఇది ఆలోచించటంలా. నూరు పువ్వులు మాత్రమే కాదు, ప్రతి పూవుకీ వికసించే అవకాశాల్ని అందించటం నేటి ప్రజాస్వామ్యంలో జరగాల్సిన పని. వనరులు పరిమితమే అయినా, సరైన రాజకీయం ఉంటే అందరి అపరిమిత అవసరాలనూ తీర్చవచ్చు. అలాంటి సమాజాన్ని నిర్మిస్తే.. అందులోనూ ఉన్నతస్థాయిలో నూటికి ఇరవై మందే ఉండవచ్చు. కానీ వారు పుట్టుకతో ఆ స్థాయికి వచ్చినవాళ్లు కాకుండా.. ప్రకృతి ఇచ్చిన సామర్థ్యాన్ని వెలికితీసుకుని స్వయంకృషితో వచ్చినవారై ఉంటారు. ఇదీ నిజమైన స్వేచ్ఛ, నాగరికత, ప్రజాస్వామ్యం, గణతంత్రం, ఆధ్యాత్మికం! ఇలాంటి సమాజంలోనే నిజమైన భద్రత, సంతోషం ఉంటాయి. ఇవి చేయకుండా ప్రజాస్వామ్యాన్ని పాత దృక్పథాలతో నడిపిస్తుంటే, ప్రజలేమో ఓట్ల జాతరకు, ఆ తర్వాత అరుపుల వీరంగాలకే పరిమితమవుతుంటే.. ఫలితం యధాతథ స్థితి, యధాలాప మార్పే అవుతుంది. అవినీతి, అణచివేత, వివక్షలతో కూడిన ఇలాంటి (అ)వ్యవస్థలో ఆందోళనలు చేయాల్సి ఉంటుంది. కానీ రోడ్లెక్కి భారీ ఆందోళనలు చేసి ఓ చిన్న ఫలితాన్ని సాధించడానికి కూడా సూపర్‌హీరోయిజం కావాల్సి వస్తుంది. చివరికి ప్రజాస్వామ్యం అశాంతిని, అసంతృప్తిని మాత్రమే మిగిల్చి వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తుంటుంది. అపార శక్తిసామర్థ్యాలు వృథా అవుతాయి. చిట్టచివరి పౌరుని ఆలోచనను కూడా సమూలంగా మార్చి స్వతంత్రంగా, కొత్తగా ఆలోచించే శక్తినిచ్చి ఈ దేశంలో విప్లవాత్మక మార్పుని తేగలిగే పునాది సరైన పాఠశాల విద్య మాత్రమే! ఆ విద్యకు తోడు ఆరోగ్యం, ఉపాధి, ఇతర వ్యవస్థల నిర్మాణం ఉంటే.. అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే ఆధునిక రిపబ్లిక్ సాకారమవుతుంది. వ్యక్తి సుఖాన్ని, సమాజహితాన్ని చక్కగా అనుసంధానం చేస్తూ.. స్వేచ్ఛ, సమానత్వం, ఆధ్యాత్మికత, భద్రత, సంతోషం అన్నీ అందులోనే ఉంటాయి. అందరికీ ఈ అవకాశాలను కల్పిస్తుంది కాబట్టే.. ఇలాంటి ప్రజాస్వామిక వ్యవస్థ రాచరిక రామరాజ్యం కంటే కూడా గొప్పది. ప్రజల్లో సుదీర్ఘకాలంగా ఉన్న అసంతృప్తి ఉన్నా అది దానంతటదే సమస్యల్ని పరిష్కరించలేదు. మార్పు కావాలన్న కాంక్షతోపాటు.. ఏరకమైన మార్పు కావాలన్న క్రియాశీల ఆలోచన కూడా తోడైతేనే జనం జీవితాలు బాగుపడతాయి. ఆలోచనను తప్పించుకుంటున్న కొద్దీ నష్టపోతూనే ఉంటాం. అధికారమే పరమావధిగా కొనసాగుతున్న పార్టీలు ప్రజల అసంతృప్తిని ఉద్రేకాలుగా, ఓట్లుగా మార్చుకునే టక్కుటమారాది విద్యల్లో ఆరితేరిపోయాయి. ఏం చేస్తే ఈ దేశం బాగుపడుందనే అంశంపై ఒక స్పష్టత, అందుకు తగిన విధానాలపై ఏకాభిప్రాయం లేకుండా వ్యవహరిస్తున్నాయి. ఏం చేయకూడదో ఆరకంగా వ్యవహరించటంలో మాత్రం ఒకేతీరుగా వ్యవహరిస్తున్నాయి. ఆ పార్టీల్లా వ్యవహరించకుండా .. సరైన వ్యవస్థల నిర్మాణం దిశగా ప్రజలని పనిగట్టుకుని చైతన్యవంతుల్ని చేయాల్సిన బాధ్యత కాస్త వనరులు, అవకాశాలు ఉన్న ఆలోచనాపరులదే. ఎన్నికల ఎజెండా మారితే, రాజకీయ జెండాలు కూడా దిశ మార్చుకుని ఎగురుతాయి. 2017-18 పాఠశాల విద్యాసంవత్సర ప్రారంభ పాఠం కూడా ఇదే.

మీ



# కార్టూన్ కార్నర్




## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ - 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం: **040-23311816**

*విడి ప్రతి : రు. **10** ,*
*ఏడాది చందా : రు. **200***
*మూడేళ్ళ చందా : రు. **500***

చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: *62007167836* ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.


# 2016-17లోనూ అదే నేరపూరిత వైఫల్యం!
# పాఠశాల విద్య - ప్రమాణాలు మిథ్య

- ఎస్‌కే నజ్మల్

అసర్ - 2016 నివేదిక ఇటీవల న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో విడుదలైంది. పదేళ్లపాటు అసర్ సర్వే నిర్వహించాలన్న ప్రథమ్ సంస్థ నిర్ణయం మేరకు 2015 నుంచి 2014 వరకు క్రమం తప్పకుండా అసర్ సర్వే జరిగింది. 2015లో విరామం ఇచ్చిన ప్రథమ్ 2016లో సర్వేను తిరిగి మొదలుపెట్టింది. దేశవ్యాప్తంగా 589 జిల్లాల్లో 499 భాగస్వామ్య సంస్థలకు చెందిన 25వేలమంది వలంటీర్లు ఈసారి సర్వే నిర్వహణా బాధ్యతను చేపట్టారు. వారు 17,473 గ్రామాలకు వెళ్లారు. 15,630 పాఠశాలలను సందర్శించారు. 3,50,232 కుటుంబాలకు చెందిన 5,62,305 మంది పిల్లలను కలుసుకున్నారు. పాఠశాల స్థితిగతులను, కుటుంబాల నేపథ్యాన్ని, పిల్లల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. పాఠశాల విద్యారంగంలోని స్థితిగతుల గురించి లోక్‌సత్తా చేస్తున్న హెచ్చరికల్ని, వాదనల్ని అసర్ నివేదిక ప్రతిబింబించింది. అందరికీ విద్య - కొందరికే నాణ్యమైన విద్య తరహాలో పాలకులు తప్పుడు విధానాలతో దుర్మార్గంగా వ్యవహరించటాన్ని బైటపెట్టింది.

**అసర్ - 2016లోని ముఖ్యాంశాలు**

పాఠశాలల్లో పిల్లల నమోదు 2009లోపు 96 శాతం ఉండగా, ఆ తర్వాత మెల్లగా పెరుగుతూ 2014 నాటికి 96.7శాతానికి, 2016లో 96.9శాతానికి చేరింది. 6-14 వయోవర్గంలో బడి బయట ఉన్న పిల్లలు 31శాతం కాగా, 7-16 వయోవర్గంలో ఈ సంఖ్య 5.3శాతంగా ఉంది. వివిధ వర్గాలలో బడి బయట ఉన్న బాలురకంటే బాలికల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. 11-14 వయోవర్గంలో బడి బయట బాలురు 4.1శాతం ఉండగా, బాలికలు 5.2శాతం ఉన్నారు. 15-16 వయోవర్గంలో బడి బయట బాలురు 14.6శాతం కాగా, బాలికలు 16.1శాతం ఉన్నారు. కొన్ని రాష్ట్రాల్లో బడి బయటి బాలుర శాతానికి, బాలికల శాతానికి మధ్య తీవ్ర వ్యత్యాసం ఉంది. 11-14 వయోవర్గంలో బడి బయట బాలుర శాతం కంటే, బడి బయటి బాలికల శాతం మధ్యప్రదేశ్‌లో 8.5శాతం, రాజస్తాన్‌లో 9.7శాతం, యూపీలో 9.9శాతం ఎక్కువగా ఉంది. బాలికల విద్య పట్ల వివక్ష క్రమేపీ తగ్గుముఖం




పడుతున్నప్పటికీ, కొన్ని రాష్ట్రాల్లో ఇంకా బలంగా కొనసాగుతున్నదని ఈ అంకెలు తెలుపుతున్నాయి.

ప్రైవేటు బడుల్లో చదువు గొప్పగా లేకపోయినా.. వాటి పట్ల తల్లిదండ్రులకు మోజు క్రమేపీ పెరుగుతోందని మరోసారి రుజువయ్యింది. ప్రైవేటు బడులలో నమోదు గ్రామీణ ప్రాంతాలలో కూడా పెరుగుతోంది. 2016 అసర్ ప్రకారం, జాతీయస్థాయిలో ప్రైవేటు బడులలో గ్రామీణ విద్యార్థుల నమోదు 30.5శాతానికి చేరింది. ప్రైవేటు బడి నమోదు మణిపూర్‌లో 71.7శాతం ఉండగా, హర్యానాలో 55.7శాతం, మేఘాలయలో 55.2శాతం, కేరళలో 54.8శాతం, పంజాబ్‌లో 51.6శాతం, యూపీలో 52.1శాతం ఉన్నాయి. తెలంగాణ, ఉత్తరాఖండ్, నాగాలాండ్ వంటి రాష్ట్రాల్లో ఈ సంఖ్య 40శాతం పైన ఉంది. ఒడిషా, పశ్చిమ బెంగాల్, త్రిపుర రాష్ట్రాలలో ప్రైవేటు బడుల నమోదు 10శాతం కంటే తక్కువ ఉంది. బీహార్, గుజరాత్, జార్ఖండ్ రాష్ట్రాలలో ఈ సంఖ్య 10-2శాతాల మధ్య ఉంది. గతంతో పోలిస్తే ప్రభుత్వ పాఠశాలల నమోదు పెరిగిన రాష్ట్రాలలో గుజరాత్, కేరళ ఉన్నాయి. 11-14 వయోవర్గం పిల్లల్లో ప్రభుత్వ బడుల్లో చేరిన పిల్లలు కేరళలో 2014లో 40.6శాతం ఉండగా, ఈ సంఖ్య 2016లో 49.9శాతానికి చేరింది. అలాగే గుజరాత్‌లో ఈ సంఖ్య 2014లో 79.2శాతం ఉండగా, 2016లో 86శాతానికి పెరిగింది.

# విద్య, వైద్యం పేరుతో ఓట్లు అడిగే రాజకీయం రావాలి

ఇక మీదట విద్య, వైద్య సేవల పేరుతో ఓట్లు అడిగే రాజకీయం రావాలని అసర్ - 2016 నివేదిక విడుదల కార్యక్రమంలో పాల్గన్న కేంద్ర ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు డా॥ అరవింద్ సుబ్రమణియన్, ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అన్నారు. ఢిల్లీలోని మొత్తం బడిపిల్లల్లో 74శాతం మంది తమ తరగతి పాఠ్యపుస్తకాన్ని చదవలేని స్థితిలో ఉన్నారని సిసోడియా అన్నారు. పదవ తరగతి పిల్లలు మాతృభాషలో సంయుక్తాక్షరాలు, ద్విత్వాక్షరాలు ఉన్న పదాలు రాయలేకపోతున్నారన్నారు. మంచి భవనాలు, మంచి ప్రిన్సిపాలు ఉన్న స్కూళ్లలో సైతం ఇదే పరిస్థితి ఉందన్నారు (కానీ కేంద్ర బడ్జెట్‌లో విద్యకు ఎందుకు ప్రాధాన్యత ఇవ్వలేదో, పంజాబ్ ఎన్నికల్లో 'ఆప్' పాఠశాల విద్య గురించి ఎందుకు మాట్లాడలేదో అరవింద్ సుబ్రమణియన్, సిసోడియా వివరణ ఇవ్వలేదు). నివేదికను 'జనబలం' వర్కింగ్ ఎడిటర్ డి.సోమసుందర్, యూపీకి చెందిన బాలికలు ప్రగతి, రీతూ చేతుల మీదుగా విడుదల చేయించారు. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ, డా॥ జయప్రకాష్ నారాయణ్ స్థాపించిన లోక్‌సత్తా కూడా అసర్ కార్యక్రమంలో భాగస్వామిగా ఉండటంతో 2005-06లో తానూ అసర్ వలంటీర్‌గా చేరానని తెలిపారు. తర్వాతికాలంలో లోక్‌సత్తా రాజకీయ పార్టీగా కూడా మారటంతో.. లోక్‌సత్తా పేరుతో అసర్ నిర్వహణ సరికాదని భావించామన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో మాట్లాడి ప్రభుత్వ డైట్ కళాశాలల విద్యార్థులను అసర్‌లో భాగస్తులను చేశామన్నారు. అప్పటి నుంచి డైట్ విద్యార్థులు అసర్ సర్వే చేస్తున్నారని, తాము వారికి తోడ్పాటు ఇస్తున్నామని తెలిపారు. విద్యారంగంలో లోతైన మార్పులు రావాలని, అలాంటి విధానమార్పుల అవసరాన్ని విధాననిర్ణేతలు గుర్తించేలా చేయటానికి రుజువులు చూపాల్సి ఉందని, అటువంటి రుజువులు అసర్ సర్వే ద్వారా లభిస్తున్నాయని అన్నారు.



**తీసివేతలు - భాగాహారాలు**

పిల్లల గణిత సామర్థ్యాల విషయంలో స్వల్పమైన మెరుగుదల నమోదైంది. 3వ తరగతి చదువుతూ చిన్నపాటి తీసివేత చేయగలిగే పిల్లల సంఖ్య 2014లో 25.4శాతం ఉండగా, 2016నాటికి ఈ సంఖ్య 27.7శాతానికి పెరిగింది. ప్రభుత్వ పాఠశాలల పిల్లల్లో వచ్చిన మెరుగుదల కారణంగానే ఈ మాత్రపు మార్పు వచ్చిందని గణాంకాలు తెలుపుతున్నాయి.

ప్రభుత్వ పాఠశాలల్లో 3వ తరగతి చదువుతున్న పిల్లల్లో గణిత సామర్థ్యాలు కనీసం 5శాతపు పాయింట్లు మెరుగుదల నమోదైన రాష్ట్రాలలో హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిషా, ఛత్తీస్‌గఢ్ ఉన్నాయి. 5వ తరగతి చదువుతూ చిన్నపాటి భాగాహారం చేయగలిగే పిల్లల జాతీయ సగటులో పెద్దగా మార్పు లేదు. 2014లో ఈ సంఖ్య 26శాతం ఉండగా, 2016లో కూడా అంతే ఉంది. కనీసం 5శాతపు పాయింట్ల మెరుగుదల నమోదైన రాష్ట్రాలలో హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్ ఉన్నాయి. 8వ తరగతి చదువుతున్న పిల్లల్లో చిన్నపాటి భాగాహారం చేయగలిగేవారి సంఖ్య క్రమేపీ దిగజారుతోంది. 2010లో భాగాహారం చేయగలిగేవారు 68.4శాతం ఉండగా, 2014నాటికి ఈ సంఖ్య 44.2శాతంగా, 2016నాటికి 43.3శాతంగా దిగజారిపోయింది. మణిపూర్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల 8వ తరగతి పిల్లల్లో మాత్రమే 5శాతం మెరుగుదల కనిపించింది.

**ఆంగ్ల పఠనం**

ఆంగ్ల మాధ్యమంపై మోజు పెరుగుతున్న ప్రస్తుత

తరుణంలో పిల్లల ఆంగ్ల భాషా పఠన సామర్థ్యాలు ఏమాత్రం ఆశాజనకంగా లేవని అసర్ నివేదిక వెల్లడించింది. 5వ తరగతి చదివే పిల్లల ఆంగ్ల పఠనా సామర్థ్యాలలో గత ఆరేళ్లుగా ఎలాంటి మార్పు కనిపించలేదు. సులభమైన ఆంగ్లవాక్యాలు చదవగలిగే 5వ తరగతి పిల్లలు 24.5శాతం ఉన్నట్లు 2016 అసర్ నివేదిక వెల్లడించింది. 2009 నుంచి ఈ సంఖ్యలో మార్పు కనిపించడం లేదు. అయితే హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర, కేరళ వంటి రాష్ట్రాలలో ప్రభుత్వ పాఠశాలల్లో 5వ తరగతి పిల్లల ఆంగ్ల పఠన సామర్థ్యాలు 5శాతపు పాయింట్ల మేర మెరుగయ్యాయి. అలాగే, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, అసోం, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో ప్రైవేటు బడుల్లో చదివే 5వ తరగతి పిల్లల ఆంగ్ల సామర్థ్యాలు మెరుగయ్యాయని కూడా అసర్ - 2016 నివేదిక తెలిపింది. కానీ జాతీయస్థాయిలో ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల పిల్లలను మొత్తంగా కలిపి చూసినపుడు వారి ఆంగ్ల సామర్థ్యాలలో పెద్దగా మార్పు లేదు.

8వ తరగతి చదువుతూ సులవైన ఆంగ్లవాక్యాన్ని చదవగలిగే పిల్లల సంఖ్య 2009లో 60.2శాతం ఉండగా, వారి సంఖ్య 2014లో 46.7శాతానికి, 2016లో 45.2శాతానికి పడిపోయింది. తాము చదివిన పదాల అర్థాలు చెప్పగలిగిన పిల్లలు 60శాతం ఉండగా, 5వ తరగతి చదివే పిల్లల్లో తాము చదివిన వాక్యాల అర్థం చెప్పగలిగినవారు 62.4శాతం ఉన్నారు. 2014 నుంచి ఈ అంకెలలో ఏమాత్రం మార్పు రాలేదు. 3వ తరగతి పిల్లల్లో సులువైన పదాలు చదవగలిగేవారు 2009లో 28.5శాతం ఉండగా, 2016లో ఈ సంఖ్య 32శాతానికి పెరిగింది. మొత్తం మీద పిల్లల ఆంగ్ల భాషా సామర్థ్యాలు అరకొరగా ఉన్నాయని రుజువైంది.

**పాఠశాలల స్థితిగతులు**

పిల్లల హాజరులో 2014తో పోలిస్తే 2016లో పెద్దగా మెరుగుదల కనిపించలేదు. ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల హాజరు 2014లో 71.3శాతంగా నమోదైంది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో పిల్లల హాజరు 2014లో 73.2శాతం ఉండగా, 2016లో 71.1శాతానికి తగ్గింది. 2009తో పోలిస్తే పిల్లల హాజరు తగ్గిపోయింది. ప్రాథమిక పాఠశాలల్లో పిల్లల హాజరు 2009లో 74.3శాతం ఉండగా, 2016లో 71.4శాతానికి తగ్గింది. ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2009లో 79శాతం ఉండగా, 2016లో ఈ సంఖ్య 73.2శాతానికి తగ్గింది.

60మంది అంతకంటే తక్కువమంది పిల్లలున్న పాఠశాలల సంఖ్య కూడా పెరుగుతోంది. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 2009లో 26.1శాతం ఉండగా, వీటి సంఖ్య 2016లో 40శాతానికి పెరిగింది. ప్రాథమికోన్నత పాఠశాలలు 4.5శాతం ఉండగా 2016లో 8.9శాతానికి పెరిగాయి.

పాఠశాలల్లో మల్టీగ్రేడ్ తరగతుల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. 2వ తరగతి పిల్లలు ఇతర తరగతుల పిల్లలతో కలసి కూర్చునే పాఠశాలల సంఖ్య 2010లో 55.2శాతం ఉండగా, 2016లో 63.7శాతానికి పెరిగింది. అలాగే 4వ తరగతి పిల్లలు ఇతర తరగతుల పిల్లలతో కలసి కూర్చునే పాఠశాలల సంఖ్య 2010లో 49శాతం ఉండగా, 2016లో 58శాతానికి పెరిగింది.

మరుగుదొడ్ల విషయంలో చక్కటి పురోభివృద్ధి కనిపిస్తోంది. వినియోగించడానికి అనువైన మరుగుదొడ్లు కలిగిన పాఠశాలల సంఖ్య 2010లో 47.2శాతం కాగా, ఈ సంఖ్య 2016లో 68.7శాతానికి పెరిగింది.

తాగునీటి సదుపాయం కలిగిన పాఠశాలల సంఖ్య 2010లో 72.7శాతం ఉండగా, 2016లో ఈ సంఖ్య 74.1శాతంగా ఉంది. అయితే ఈ సంఖ్య 2014లో 75.6శాతం ఉండటం గమనార్హం. బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాలలో తాగునీటి సదుపాయం కలిగిన పాఠశాలల సంఖ్య 85శాతాన్ని మించి ఉండటం విశేషం. కంప్యూటర్ సదుపాయం పిల్లలకు కల్పించిన పాఠశాలల సంఖ్య 2014లో 19.6శాతం ఉండగా, 2016లో ఈ సంఖ్య 20శాతంగా ఉంది. అయితే కొన్ని రాష్ట్రాలలో వీటి సంఖ్య గణనీయంగా ఉంది. కేరళలో 89శాతం, గుజరాత్‌లో 75.2శాతం, మహారాష్ట్రలో 55.1శాతం, తమిళనాడులో 57.3శాతం పాఠశాలల్లో కంప్యూటర్లు ఉన్నాయని అసర్ వలంటీర్లు సందర్శించిన పాఠశాలల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. గ్రంథాలయాలు కలిగిన పాఠశాలలు 2014లో 78.1శాతం ఉండగా, 2016లో 75.5శాతానికి తగ్గింది. పిల్లలు గ్రంథాలయంలోని పుస్తకాలు వినియోగిస్తున్న పాఠశాలల సంఖ్య 2014లో 40.7శాతం ఉండగా, 2016లో 42.6శాతానికి పెరిగింది. ■

# నాసిరకంలో పోటీపడుతున్న 'తెలుగు రాష్ట్రాలు'

- సాంబమూర్తి, ఆర్ఎల్ జ్యోతి



ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో పాఠశాల విద్యాస్థితిగతులు గతంతో పోలిస్తే దిగజారాయని అసర్ - 2016 నివేదిక వెల్లడించింది. పాఠశాలల సదుపాయాలు మెరుగుపడకపోగా, పిల్లల హాజరు తగ్గుముఖం పట్టగా వారి అభ్యసనా సామర్థ్యాలు అంతంతమాత్రంగా ఉన్నాయని నివేదిక తేటతెల్లం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల్లో, 390 గ్రామాల్లోని 779 కుటుంబాలకు చెందిన 7333 మంది పిల్లల సమాచారాన్ని అసర్ వలంటీర్లు సేకరించారు. 380 పాఠశాలలను సందర్శించి అక్కడి స్థితిగతులను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ మినహా మిగిలిన (పాత) 9 జిల్లాల్లో, 27 గ్రామాల్లోని 5400 కుటుంబాలకు చెందిన 5963మంది పిల్లల సమాచారాన్ని సేకరించారు. 264 పాఠశాలలను సందర్శించారు.

పాఠశాల నమోదు 6-14 వయోవర్గంలో ఆంధ్రప్రదేశ్‌లో 97.4శాతం ఉండగా, తెలంగాణలో 97.9 ఉంది. బడిబైటి పిల్లలు 2.6శాతం, 2.2 శాతం ఉన్నారు. 7-16 వయోవర్గంలో బడిబైటి పిల్లలు ఏపీలో 4.8శాతం కాగా, తెలంగాణలో 4.1శాతం ఉన్నారు. 11-14 వయోవర్గంలో బడిబైటి బాలురు ఏపీలో 4.4శాతంకాగా, తెలంగాణలో 3.2శాతం ఉన్నారు. అలాగే 15-16 వయోవర్గంలోని బడిబైటి బాలురు ఏపీలో 16.8శాతంకాగా, తెలంగాణలో 11.2శాతం. బాలికలు ఏపీలో 13.2శాతం, తెలంగాణలో 12.8శాతం.

ప్రైవేటు బడుల్లో పిల్లల నమోదు ఏపీలో 34.2శాతం ఉండగా, తెలంగాణలో 40.4శాతం ఉంది. 7-10 వయోవర్గంలో ప్రైవేటు బడుల్లో చదివే బాలురు ఏపీలో 42.9శాతం కాగా, తెలంగాణలో 51.3శాతం ఉన్నారు. అదే వయోవర్గంలో బాలికలు ఏపీలో 34.4శాతంకాగా, తెలంగాణలో 42.4శాతం ఉన్నారు. 11-14 వయోవర్గంలో ప్రైవేటు బడుల్లో చదివే పిల్లల్లో బాలురు ఏపీలో 34.3శాతం ఉండగా, తెలంగాణలో 36.5శాతం ఉన్నారు. బాలికలు ఏపీలో 24.1శాతం ఉండగా, తెలంగాణలో 27.4శాతం. ఇక 15-16 వయోవర్గంలో ప్రైవేటు బడుల్లో చదివే పిల్లల్లో బాలురు ఏపీలో 33.5శాతం కాగా, తెలంగాణలో 27.7శాతం, బాలికలు ఏపీలో 33.7శాతం, తెలంగాణలో 25.9శాతం ఉన్నారు. పాఠశాల నమోదును పరిశీలిస్తే విద్య పట్ల ఏపీకంటే తెలంగాణలో కాస్త ఎక్కువ ఆసక్తి కనిపించింది.

బాలికా విద్య విషయంలో, ప్రైవేటు బడుల నమోదు, బాలికల్ని ప్రైవేటు బడుల్లో చేర్పించడం విషయంలో ఏపీకంటే తెలంగాణయే ఎంతో కొంత ముందంజ వేస్తున్నట్టు అసర్ - 2016 గణాంకాలు వెల్లడించాయి.

**పఠన సామర్థ్యాలు - తెలుగు**

గొప్పలు చెప్పుకోవడంలో పోటీపడే తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇద్దరూ తమ తమ రాష్ట్రాలలో పిల్లల చదువులు చట్టుబండలవుతున్నాయన్న వాస్తవాన్ని గమనించడం మంచిది. 3వ తరగతి పిల్లల్లో 1వ తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవగలిగే పిల్లలు ఏపీలో 45.8శాతం ఉంటే, తెలంగాణలో 40.3శాతం ఉన్నారు. 5వ తరగతి పిల్లల్లో 1వ తరగతి స్థాయి పాఠ్యాంశాల్ని చదవలేనివారు ఏపీలో 23.3శాతం ఉండగా, తెలంగాణలో 29.5 ఉన్నారు. 8వ తరగతిలోకి వచ్చాక కూడా 1వ తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవలేని పిల్లలు ఏపీలో 8.4శాతం ఉండగా, తెలంగాణలో 13శాతం ఉన్నారు. 1వ తరగతి పిల్లల తరగతివారీ సామర్థ్యాలు ఘోరంగా ఉన్నారు. పదాలు చదవగలిగే పిల్లలు ఏపీలో 24.5శాతం ఉండగా, తెలంగాణలో 24.7శాతం మాత్రమే ఉన్నారు. అక్షరాలు మాత్రమే చదవగలిగే 1వ తరగతి పిల్లలు ఏపీలో 35.9శాతం ఉండగా, తెలంగాణలో 34.2శాతం ఉన్నారు. 1వ తరగతిలో ఉన్న పిల్లల్లో కనీసం అక్షరాలు కూడా గుర్తుపట్టలేని పిల్లలు ఏపీలో 33.4శాతం ఉండగా, తెలంగాణలో 36.5శాతం ఉన్నారు.

3వ తరగతి పిల్లల్లో 2వ తరగతి స్థాయి పాఠ్యాంశాన్ని చదవగలిగేవారు ఏపీలో 22.7శాతం ఉండగా, తెలంగాణలో 18.6శాతం ఉన్నారు. 5వ తరగతి పిల్లల్లో అదేస్థాయి పాఠ్యాంశాన్ని చదవగలిగేవారు ఏపీలో 55.1శాతం ఉండగా, తెలంగాణలో 47.1శాతం ఉన్నారు. 8వ తరగతి పిల్లల్లో 2వ తరగతి స్థాయి పాఠ్యాంశాల్ని చదవగలిగేవారు ఏపీలో 77.8శాతం కాగా, తెలంగాణలో 75.8శాతం.

**గణిత సామర్థ్యాలు**


తెలుగు రాష్ట్రాలు రెండింటిలోనూ పిల్లల గణిత సామర్థ్యాలు నాసిగా ఉన్నాయి. 3వ తరగతి పిల్లల్లో రెండంకెల తీసివేత చేయగలిగే పిల్లలు ఏపీలో 48.1శాతం ఉండగా, తెలంగాణలో 42.1శాతం ఉన్నారు. 5వ తరగతి పిల్లల్లో తీసివేత చేయగలిగే పిల్లలు ఏపీలో 68.1శాతం ఉండగా, తెలంగాణలో 68.5శాతం ఉన్నారు. 8వ తరగతిలో చిన్నపాటి తీసివేత చేయలేని పిల్లలు ఏపీలో 18.3శాతం కాగా, తెలంగాణలో 17.7శాతం.

భాగాహారాల విషయం వస్తే మూడంకెల సంఖ్యను ఒక్క అంకెతో భాగించే చిన్నపాటి లెక్క చేయడానికి తెలుగు పిల్లలు తడబడుతున్నారు. 3వ తరగతిలో భాగాహారం చేయగలిగే పిల్లలు ఏపీలో 6.6శాతం మాత్రమే ఉంటే, తెలంగాణలో వీరి సంఖ్య 4.7శాతంగా మాత్రమే ఉంది. 5వ తరగతిలో చిన్నపాటి భాగాహారం చేయగలిగే పిల్లలు ఏపీలో 37.2శాతం ఉండగా, తెలంగాణలో 30.4శాతం ఉన్నారు. 8వ తరగతిలోకి వచ్చినా ఆ మాత్రం భాగాహారం చేయలేని పిల్లలు ఏపీలో 49.6శాతం ఉండగా, తెలంగాణలో 44.9శాతం ఉన్నారు.

**పఠన సామర్థ్యాలు - ఆంగ్లం**

ఆంగ్ల మాధ్యమం మీద తల్లిదండ్రుల్లో, పాలకుల్లో మోజు ఎంత పెరిగిపోతున్నా పిల్లలు మాత్రం ఇంగ్లిష్ చదువుల్లో తడబడుతున్నారు. 1వ తరగతి చదివేవారిలో పెద్దబరి అక్షరాలను సైతం గుర్తించలేని పిల్లలు ఏపీలో 31.8శాతం ఉండగా, తెలంగాణలో 31.3శాతం ఉన్నారు. 3వ తరగతిలో చిన్న చిన్న పదాలు చదవగలిగే పిల్లలు ఏపీలో 55.2శాతం ఉండగా, తెలంగాణలో 57.8శాతం ఉన్నారు. 5వ తరగతిలో చిన్న పదాలు మాత్రమే చదవగలిగే పిల్లలు ఏపీలో 76.1శాతం ఉండగా, తెలంగాణలో 67.3శాతం ఉన్నారు. 8వ తరగతిలోకి వచ్చాక కూడా చిన్నపాటి పదాలు మాత్రమే చదవగలిగే స్థాయిలో మిగిలిపోయినవారు ఏపీలో 15.5శాతం ఉంటే, తెలంగాణలో 12.2శాతం ఉన్నారు.

చిన్న చిన్న ఇంగ్లిష్ వాక్యాలు చదవాలంటే తెలుగు పిల్లల తలప్రాణం తోకకు వస్తోంది. 3వ తరగతిలో వాక్యాలు చదవగలిగే పిల్లలు ఏపీలో 29.2శాతం ఉండగా, తెలంగాణలో



30శాతం ఉన్నారు. 5వ తరగతిలో సులభ వాక్యాలు చదవగలిగే పిల్లలు ఏపీలో 47.3శాతం ఉండగా, తెలంగాణలో 44.1శాతం ఉన్నారు. ఇక 8వ తరగతిలోకి వచ్చాక కూడా సులభ వాక్యాలు చదవలేని పిల్లలు ఏపీలో 28.7శాతం, తెలంగాణలో 31.9శాతం ఉన్నారు.

**పాఠశాలల స్థితిగతులు**

సదుపాయాల విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో పరిస్థితులు మెరుగవుతున్నాయని అసర్ నివేదిక వెల్లడించింది. వంటగది ఉన్న పాఠశాలలు 2010లో 64.2శాతం ఉండగా, 2016 వచ్చేసరికి వీటి సంఖ్య ఏపీలో 70శాతానికి, తెలంగాణలో 81.1శాతానికి చేరుకుంది. వినియోగానికి అనువుగా మరుగుదొడ్లు ఉన్న పాఠశాలల సంఖ్య 2010లో 38.2శాతం మాత్రమేకాగా, 2016లో వీటి సంఖ్య ఏపీలో 72.08శాతానికి, తెలంగాణలో 64.4శాతానికి పెరిగింది. అయితే తాగునీరు, గ్రంథాలయ వినియోగం విషయంలో సౌకర్యాలు గతం కంటే తగ్గుముఖం పట్టినట్టు వెల్లడైంది. తాగునీటి సదుపాయం ఉన్న పాఠశాలలు 2010లో 64.8శాతం ఉండగా, 2016నాటికి వీటి సంఖ్య ఏపీలో 56.6శాతానికి, తెలంగాణలో 56.8శాతానికి తగ్గిపోయింది. అలాగే పిల్లలు గ్రంథాలయాన్ని వినియోగించుకుంటున్న పాఠశాలల సంఖ్య 2010లో 77.6శాతం ఉండగా, 2016లో వీటి సంఖ్య ఏపీలో 70.5శాతానికి, తెలంగాణలో 58.9శాతానికి తగ్గిపోయింది.

కంప్యూటర్ పరిజ్ఞానం గురించి, డిజిటల్ లావాదేవీల గురించి చాలా ఎక్కువగా తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు మాట్లాడుతుంటారు. కానీ బడుల్లో పిల్లల కోసం కంప్యూటర్లు ఇవ్వడంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు నత్తనడకన సాగుతున్నాయి. పిల్లల వినియోగం కోసం కంప్యూటర్లు ఉన్న పాఠశాలల సంఖ్య 2010లో 9.3శాతం ఉండగా, 2016లో వీటి సంఖ్య ఏపీలో 17.4శాతానికి, తెలంగాణలో 12.2శాతానికి పెరిగాయి. బడిలో ఉన్న కంప్యూటర్లను

వినియోగించడంకూడా అరుదనే చెప్పాలి. పిల్లలు కంప్యూటర్లను వినియోగిస్తున్న పాఠశాలలు 2010లో 6.2శాతం మాత్రమే ఉండగా, వీటి సంఖ్య 2016లో ఏపీలో 9.5శాతానికి స్వల్పంగా పెరగ్గా, తెలంగాణలో 4.6శాతానికి పడిపోయింది. 60మంది కంటే తక్కువ పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలు 2010లో 36.9శాతం ఉండగా, 2016లో వీటి సంఖ్య ఏపీలో 39.2శాతానికి పెరిగింది. ప్రాథమికోన్నత పాఠశాలలు 2010లో 16.3శాతం ఉండగా, 2016లో వీటి సంఖ్య ఏపీలో 25శాతానికి పెరిగింది. ఇదే విషయంలో తెలంగాణలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల సగటు 2010లో 17.2శాతం ఉండగా, 2016లో 26.5శాతం ఉంది.

మల్టీగ్రేడ్ తరగతుల విషయానికొస్తే, 2వ తరగతిలో ఇతర తరగతులు కలిపి కూర్చోబెడుతున్న పాఠశాలలు 2010లో 62.2శాతం ఉంటే, 2016లో ఏపీలో 66.4శాతం ఉన్నాయి. తెలంగాణలో 51.9శాతం ఉన్నాయి. విద్యాహక్కు నిబంధనలను పాఠశాలల్లో అమలు చేయడం లేదని మల్టీగ్రేడ్ తరగతుల సంఖ్య తేటతెల్లం చేస్తోంది. ■

# హోదా రాయితీల విషయంలో రాష్ట్రానికి అన్యాయం



ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా పదిహేనేళ్లు కావాలన్న చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రయ్యాక కేంద్రంలోని బీజేపీ నేతృత్వ సర్కారుతో కలిసి తెలుగువారికి అన్యాయం చేస్తున్నారని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. ప్రత్యేక హోదాలో భాగమైన పారిశ్రామిక రాయితీలు లేకుంటే ఏపీలోని యువతకు ఉపాధి కష్టమవుతుందని, అందువల్ల ఏ పేరుతోనైనా ఆ రాయితీల్ని కేంద్రం నుంచి సాధించుకోవాలన్నారు. లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యంతో కలిసి తిరుపతిలో బాబ్జీ మీడియాతో మాట్లాడుతూ.. వెనకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్రకజిల్లాలకు పారిశ్రామిక రాయితీలు తప్పనిసరి అవసరమన్నారు. హోదా రాయితీలు, కడపకు కర్మాగారం, ఉత్తరాంధ్రలో మూతపడ్డ పరిశ్రమలను తెరిపించటం, విశాఖకు రైల్వే జోన్.. ఇలా చేయాల్సిన పనులు చేయకుండా ముఖ్యమంత్రి ఈవెంట్ మేనేజ్‌మెంట్ల కోసం కోట్లు దుర్వినియోగం చేస్తున్నారన్నారు. విశాఖ ఉత్సవాల పేరుతో భారీగా ప్రజాధనం దుర్వినియోగమయిందని అయ్యన్న పాత్రుడు మంత్రి హోదాలోనే విమర్శించారన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ తిరుపతి అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్, మదన్ మోహన్ రెడ్డి, అనంతపురం జిల్లా నాయకులు వెంకటరమణ, రెడ్డప్ప, లోకేష్, మల్లిఖార్జున, విజయ్ కిరణ్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు. ■

# ఓగేరు వంతెనను త్వరగా నిర్మించండి



పట్టణంలోని గడియార స్తంభం నుంచి బ్రహ్మంగారి గుడిబజారు చివరి వరకూ ఓగేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని కోరుతూ లోక్‌సత్తా పార్టీ నేతలు రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి ప్రత్తిపాటి పుల్లారావుకు విజ్ఞాపన పత్రం అందచేశారు. చిలకలూరిపేటలోని పాటిమీద, రాగన్నపాలెం, వడ్డెరకాలనీ, జాగుపాలెం, చినపసుమర్రు ప్రాంతాలకు చెందిన చాలామంది రైతులకు ఓగేరు వాగు అవతలి ఒడ్డున పొలాలున్నాయని, అక్కడికి వెళ్లాలంటే జాతీయ రహదారి చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని లోక్‌సత్తా పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ అన్నారు. రైతులు, రైతుకూలీలు, మహిళలు దీనివల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాగు పొంగినప్పుడు పరిస్థితి ప్రమాదకరంగా ఉంటోందన్నారు. మంత్రి ప్రత్తిపాటి సానుకూలంగా స్పందించి ఓగేరు వంతెన నిర్మాణానికి హామీ ఇచ్చారు. లోక్‌సత్తా పార్టీ నేతలు మురికిపూడి ప్రసాద్, కేవీఆర్ రెడ్డి, పువ్వాడ శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వర్లు, సిద్దమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు. ■

# భవిష్యత్తు తెలంగాణను వణికించే విద్యాప్రమాణాలు



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ స్కూళ్లలో విద్యాప్రమాణాలపై సర్వే చేశారు. పదేళ్లుగా గ్రామీణ భారతదేశంలోని విద్యాస్థాయిపై 'అసర్' సర్వే చెబుతున్న ఫలితాలనే హైదరాబాద్ సర్వే కూడా చెప్పింది. మన పాఠశాల విద్యార్థులలో పలువురికి మాతృభాషలో సహా భాషాపరిజ్ఞానం, సామాన్య లెక్కలు చేయడం, తర్కబద్ధంగా ఆలోచించడం వంటి వాటిలో కనీస నైపుణ్యం లేదన్నదే సర్వే సారాంశం. మనదేశంలో ప్రభుత్వ, ప్రయివేటు తేడా లేకుండా పేద, మధ్యతరగతివారు చదువుకునే పాఠశాలల్లో విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని, దానివల్ల ఉన్నత విద్యలో, ఉపాధి నైపుణ్యాల్లో వెనకబడుతున్నారని, ఆర్భాటంగా తీసుకొచ్చిన విద్యాహక్కు చట్టం వల్ల ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు ఇంకా తగ్గి ప్రయివేటు వైపు మొగ్గు పెరుగుతోందని, విద్యా హక్కు చట్టంలోని వైఫల్యాలను సవరించి అందరికీ విద్యను అందించే నూతన విద్యావిధానాన్ని ఆవిష్కరించాలని లోక్‌సత్తా చేస్తున్న వాదనలను 2015లో చేసిన హైదరాబాద్ సర్వే ధృవీకరించింది. ఆ తర్వాత కొన్ని నెలల క్రితం తెలంగాణ విద్యాశాఖ బృందాలు రాష్ట్రవ్యాప్తంగా (పాత పది జిల్లాల్లో) చేసిన సర్వే కూడా ఈ వాదనల్ని ధృవీకరించింది. ఈసారి ప్రయివేటు స్కూళ్లను కూడా కలిపి సర్వే చేశారు (గతంలో 74 దేశాలలోని ఉన్నత పాఠశాల విద్యార్థుల మధ్య చేసిన 'పీసా' సర్వేలో భారతదేశం దాదాపు అట్టడుగున 73వ స్థానంలో ఉంది. అందులో చదవడం, రాయడం, చిన్న లెక్కలు చేయడంతోపాటు విశ్లేషించడం, సొంతంగా ఆలోచించటం, కొత్తగా పరిష్కారాలు చెప్పటం వంటి అంశాల మీద కూడా పిల్లల్ని పరీక్షించారు. ఆ స్థాయి ప్రమాణాలను మనకున్న వనరుల మధ్యే తీసుకున్నా.. ఇటీవలి సర్వే ఫలితాలు ఇంకా అధ్వాన్నంగా ఉండేవని కొందరు విద్యావేత్తల అభిప్రాయం. ఈ సర్వేను ఉదారంగానే చేశారు కాబట్టి వాస్తవాలు కొంత మరుగునపడ్డాయనే భావించి.. విద్యాప్రమాణాల పెంపు కోసం భారీ ప్రక్షాళన చేయాలని సూచిస్తున్నారు).

తెలంగాణలోని ప్రభుత్వ/ఎయిడెడ్ స్కూళ్లలో చదివే ప్రతి విద్యార్థి మీద సర్కారు ఏటా రూ. 39,000 ఖర్చు చేస్తున్నా ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయని, మార్కులు వస్తున్నాయిగానీ చదువు అత్తెసరుగానే ఉందని రాష్ట్ర విద్యాశాఖ బృందాల సర్వే తేల్చింది (అసర్-2016 సర్వేలో కూడా దాదాపు ఇదే వెల్లడైంది). ఎన్నో ఏళ్లుగా విద్యాప్రమాణాలు నాసిరకంగా కొనసాగుతున్నాయని తెలిపింది.

విద్యాశాఖ ఉన్నతాధికారులు, రాష్ట్రస్థాయి బృందాల తాజా నివేదిక ప్రకారం.. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తెలుగులో చదవగలిగినవారు 52 శాతమే ఉన్నారు. తెలుగులో రాయగలిగిన వారు 42శాతమే ఉన్నారు. ఇంగ్లిష్‌లో పదాలు చదవగలిగినవారు 40శాతం, రాయగలిగినవారు 30శాతం ఉన్నారు. గణితంలో కూడికలు చేయగలిగినవారు 62శాతం, తీసివేతలు చేయగలిగినవారు 53శాతం, గుణకారం చేయగలిగినవారు 38శాతం, భాగాహారం చేయగలిగినవారు 26శాతం ఉన్నారు. ప్రయివేటు స్కూళ్లదీ కాస్త అటూఇటుగా

ఇదే పరిస్థితి. వాటిల్లో తెలుగు చదవగలిగినవారు 60శాతం, రాయగలిగినవారు 56శాతం ఉన్నారు. ఇంగ్లిష్ పదాలు చదవగలిగినవారు 65శాతం, రాయగలిగినవారు 61శాతం ఉన్నారు. గణితంలో కూడికలు, తీసివేతలు చేయగలిగినవారు 75, 69శాతం, గుణకారం, భాగాహారం చేయగలిగినవారు 57, 49శాతం ఉన్నారు. రాష్ట్రంలోని 394 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, 116 ప్రాథమికోన్నత పాఠశాలలు, 401 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 109 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు, 57 మోడల్ స్కూళ్లు, 56 గురుకుల పాఠశాలలు, 116 ప్రయివేటు ప్రాథమిక పాఠశాలలు, 119 ప్రయివేటు ఉన్నత పాఠశాలలు కలిపి 1,368 స్కూళ్లలో అధ్యయనం చేశారు. విద్యాప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయని, పక్కా కార్యాచరణతో ప్రమాణాల్ని పెంచాలని నివేదిక సూచించింది.

♦ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగులో చదవడం, రాయడంలో ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాలు వెనుకంజలో ఉన్నాయి. ఇంగ్లిష్ చదవడం, రాయడంలో రాష్ట్ర సగటు 48శాతం, 38శాతం ఉండగా.. ఆదిలాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇంతకన్నా తక్కువగా ఉంది.

♦ రాష్ట్రంలో సగటున ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కూడికలు చేయగలిగినవారు 45శాతం, తీసివేతలు చేయగలిగినవారు 59శాతం, గుణకారం చేయగలిగినవారు 45శాతం, భాగాహారం చేయగలిగినవారు 35శాతం ఉన్నారు. ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో ఇంతకన్నా తక్కువగా ప్రగతి ఉంది. గణితంలో రాష్ట్ర సగటు కంటే రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్, నిజామాబాద్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల్లో పిల్లలు బాగా చేయగలుగుతున్నారు.

♦ ప్రభుత్వ పాఠశాలల్లోని పిల్లల్లో దాదాపు 50శాతం మంది కనీస సామర్థ్యాలు లేకుండా 6వ తరగతిలో చేరారు.

## హైదరాబాద్ ఇంకా అధ్వాన్నం

సర్కారీ బడుల్లో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గిపోతున్న హైదరాబాద్ ఆశ్చర్యకరంగా తెలంగాణలోని మిగతా జిల్లాల కంటే చాలా పరామితుల్లో వెనకబడి ఉంది. కేవలం డబ్బున్న, అవకాశాలు అందుబాటులో ఉన్న కొంతమంది విద్యార్థుల ర్యాంకులను చూపిస్తూ హైదరాబాద్ గొప్పన్నట్టు ప్రచారం చేస్తున్నారన్న విమర్శ నిజమేనని నివేదికలో తేలింది. హైదరాబాద్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది 6,831మంది విద్యార్థులు తగ్గారు. 2015-16లో సర్కారీ బడుల్లో 1,25,864మంది విద్యార్థులు చేరగా, 2016-17లో ఈ సంఖ్య 1,19,033కు తగ్గింది. ఈ అంకెల్ని కూడా ఎక్కువ చేసి చూపినవిగానే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. తాజా సర్వేలో హైదరాబాద్ జిల్లాలోని మొత్తం 146 స్కూళ్లను బృందం పరిశీలించింది.

♦ 12మంది ఉపవిద్యాధికారులు, 24మంది ఉప పర్యవేక్షణాధికారులు ఉన్న హైదరాబాద్ ప్రభుత్వ ఉపాధ్యాయుల హాజరీలో రాష్ట్రంలో అథమస్థానంలో నిలిచింది. ఉపాధ్యాయుల హాజరు 80శాతంగా ఉంది.

♦ తెలుగు చదవడంలో రాష్ట్ర సగటు 52శాతంగా ఉంటే, హైదరాబాద్ సగటు 42శాతమే. హైదరాబాద్ కంటే వెనక వరసలో ఆదిలాబాద్ (18శాతం), మహబూబ్‌నగర్ (34శాతం) మాత్రమే ఉన్నాయి.

♦ తెలుగు రాయడంలో రాష్ట్ర సగటు 42శాతంగా ఉంటే, హైదరాబాద్ జిల్లా రంగారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నల్గొండలకంటే వెనకబడి వుంది.

♦ ఆంగ్ల పదాలు చదవడంలో రాష్ట్ర సగటు 40శాతం కాగా, అత్యున్నత స్థాయి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలున్న హైదరాబాద్ సగటు కేవలం 32శాతం. ఈ విషయంలో కూడా కేవలం ఆదిలాబాద్ (12శాతం), మహబూబ్‌నగర్ (30శాతం) మాత్రమే హైదరాబాద్ కంటే వెనక ఉన్నాయి.

♦ ఆంగ్లపదాలు రాయడంలో రాష్ట్ర సగటు 30శాతం ఉంటే, హైదరాబాద్ 18శాతంతో తొమ్మిదో స్థానంలో నిలిచింది. ఆదిలాబాద్ (4శాతం) జిల్లా విద్యార్థులు మాత్రమే హైదరాబాద్ కంటే వెనకబడి వున్నారు.

♦ గణితం కూడికలు, తీసివేతల్లో రాష్ట్ర సగటు 62శాతం కాగా, హైదరాబాద్ జిల్లా 36శాతంతో ఎనిమిదవ స్థానంలో ఉంది. హైదరాబాద్ కంటే వెనకబడిన జిల్లాలేవో తేలిగ్గా ఊహించేసుకోవచ్చు.

♦ గుణకారాల్లోనూ రాష్ట్ర సగటు 38శాతం కంటే నాలుగు శాతం తక్కువలో హైదరాబాద్ ఉంది.

♦ భాగాహారంలో రాష్ట్ర సగటు 26శాతంతో హైదరాబాద్ సగటు సమానస్థాయిలో ఉంది.

♦ అయితే హైదరాబాద్‌లోని ప్రయివేటు పాఠశాలల విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల పిల్లల కంటే కొంత మెరుగ్గా ఉండటం సర్వేలో కనిపించింది.

## సీసీఈపై పలువురు ఉపాధ్యాయులకే అవగాహన లేదు

విద్యార్థులు బట్టీ పట్టే విధానానికే పరిమితంకాకుండా సొంతంగా ఆలోచించేందుకు, స్పందించేందుకు, వారిలో సృజనాత్మకతను పెంచేందుకు, ప్రతిభను ఎప్పటికప్పుడు అంచనా వేసేందుకు అమల్లోకి తెచ్చిన నిరంతర సమగ్ర మూల్యాంకనం (సీసీఈ)పై చాలామంది ఉపాధ్యాయులకే సరిగా అవగాహన లేదని సర్వేలో తేలింది. దీనివల్ల పాఠశాలల్లో అమలు సక్రమంగా లేదు.

ప్రయివేటు, ప్రభుత్వ తేడా లేకుండా టీచర్లు సీసీఈకి అనుగుణంగా బోధన చేయలేకపోతున్నారు. పుస్తకాల్లో ఉన్నది చదివి వినిపించడానికి, వల్లె వేయడానికే పరిమితమవుతున్నారు. సీసీఈని పక్కాగా అమలుచేయాలని విద్యాశాఖ ఆదేశాల మీద ఆదేశాలు జారీ చేస్తున్నా క్షేత్రస్థాయిలో మాత్రం మార్పు రావడం లేదు. సీసీఈ అమలులో భాగంగా సాంఘికశాస్త్రంలో 'సమకాలీన అంశాలపై నివేదిక' రాయడంలో అనేకమంది టీచర్లకు అవగాహన కొరవడుతోంది. ఇంగ్లిష్‌లో మొదటి సాధనమైన రీడ్ అండ్ రిఫ్లెక్ట్ రాయడంలోనూ ఇబ్బంది పడుతున్నారు. గణితంలో నూతన సమస్యలు పరిష్కరించటం పలువురు ఉపాధ్యాయులకు ఇంకా కష్టంగానే ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో 'పిల్లల భాగస్వామ్యం, ప్రతిస్పందనలు' అనే అంశాన్ని ఏ తరగతికి, ఏ సబ్జెక్టులో, ఎలా నిర్వహించాలో స్పష్టత లేదు.

పాఠశాలల్లో ఒక విద్యాసంవత్సరంలో సీసీఈ పద్ధతిలో 4 నిర్మాణాత్మక మూల్యాంకనాలు (ఫార్మేటివ్ అసెస్‌మెంట్), రెండు సంగ్రహణాత్మక మూల్యాంకనాలు (సమ్మేటివ్ అసెస్‌మెంట్) నిర్వహించాలి. 2016 సెప్టెంబర్ నెలాఖరుకల్లా రెండు నిర్మాణాత్మక మూల్యాంకనాలు నిర్వహించాల్సి వుండగా 95శాతం స్కూళ్లలో ఒకటే పూర్తయింది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్ఏ-1ను 100శాతం, ఎఫ్ఏ-2ను 20శాతం స్కూళ్లలో నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఎఫ్ఏను ఎక్కడా నిర్వహించలేదు. ఎఫ్ఏ-1 వివరాలను రికార్డులలో నమోదు చేసినప్పటికీ, లఘు పరీక్షలు, ప్రాజెక్టు పనులను నిర్వహించినప్పటికీ పుస్తకంలోని ప్రశ్నలనే యధాతథంగా ఇచ్చారు తప్ప విద్యార్థులు స్వయంగా ఆలోచించగలిగేలా రూపొందించలేదు. ప్రయివేటు పాఠశాలల్లో ముందుగానే ముఖ్యమైన ప్రశ్నలను ఇచ్చి అభ్యాసం చేయిస్తున్నారు.

చాలా పాఠశాలల్లో బోధన ఇంకా చదివి వినిపించడం, చూసి రాయించడం, వల్లె వేయించటం చుట్టూనే తిరుగుతోంది. ఉన్నత పాఠశాలల్లో పాఠ్యపుస్తకాల వినియోగం కొంత మెరుగ్గా వుంది. అయితే ఏ సబ్జెక్టులోనైనా మొత్తం పాఠాన్ని 2 నుంచి 4 పీరియడ్లలో పూర్తి చేస్తున్నారు. చదివి వివరించిన అనంతరం.. పాఠాల్లో ఇచ్చిన అభ్యాసాలను బోర్డుపై రాయించి హోంవర్క్‌గా ఇస్తున్నారు. వాటికి ప్రభుత్వ పాఠశాలల్లో 40శాతం మంది, ప్రయివేటులో 10శాతం మంది విద్యార్థులు సొంతంగా రాస్తున్నారు. మిగతావారు గైడ్లు, నోటు పుస్తకాలు చూసి రాస్తున్నారు.

మొత్తంగా విద్యారంగాన్ని సమూలంగా ప్రక్షాళన చేసి తల్లిదండ్రులు, పిల్లలు, ఉపాధ్యాయులు, అన్ని వర్గాల ప్రజలు, దేశ అవసరాలు కోరుకుంటున్న 'విద్యలో సక్సెస్'కి కొత్త నిర్వచనం ఇవ్వటం తెలంగాణ వాస్తవిక అభివృద్ధికి అవసరమని తాజా సర్వే స్పష్టం చేస్తోంది. సర్వే తెలంగాణకే సంబంధించినదయినా, ఈ పాఠం ఆంధ్రప్రదేశ్ సహా దేశమంతటికీ వర్తిస్తుంది. నూతన జాతీయ విద్యావిధానానికి లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ఇచ్చిన సూచనల (www.fdrindia.org) ప్రాతిపదికన విద్యాసంస్థల్లో, వర్సిటీల్లో నిర్వహిస్తున్న 'యూత్ పార్లమెంటు'ల్లో కూడా ఇదే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ■

# పాఠశాల పరీక్షల్లో మార్పులు

పాఠశాల పరీక్షల్లో గణనీయ మార్పులు తీసుకురానున్నట్టు కేంద్ర మానవ వనరుల శాఖా మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. అందరికీ విద్య అంటే స్కూళ్లలో ఎన్‌రోల్‌మెంట్‌నే ఇప్పటిదాకా గుర్తిస్తున్నారని, మంచి విద్య అవసరాన్ని కూడా గుర్తించాల్సిన అవసరముందని అంగీకరించారు. నూతన జాతీయ విద్యావిధానంలో పాఠశాలలకు సంబంధించి ప్రధానంగా ఐదు మార్పులు, చేర్పులను బిల్లులో ప్రతిపాదించినట్టు ఆయన వివరించారు:

- 5, 8 తరగతుల్లో 'డిటెన్షన్' విధానాన్ని తీసుకొస్తారు. ఉత్తీర్ణత కోసం విద్యార్థులకు రెండుసార్లు పరీక్ష రాసే అవకాశం కల్పిస్తారు. మొదటిది మార్చిలో, రెండవది జూన్‌లో నిర్వహిస్తారు. మొదటిదాంట్లో తప్పితే, రెండోసారి రాయవచ్చు. రెండోసారీ తప్పితే అదే తరగతిలో కొనసాగవలసి వస్తుంది.
- డిటెన్షన్ విధానం అమలు చేసే అధికారం రాష్ట్రాలకే.
- పదో తరగతి పబ్లిక్ పరీక్షలను తప్పనిసరి చేస్తారు.
- ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల్లో పాఠ్యాంశాలను మార్చనున్నారు. గత పదేళ్లుగా ఎటువంటి మార్పులు లేకపోవడంతో కొత్త అంశాలు చేర్చనున్నారు. ఇందు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల అభిప్రాయాలు స్వీకరిస్తారు.
- విద్యార్థులు ఎంతమేరకు నేర్చుకున్నారన్నదానిపై ప్రతి తరగతికీ కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తారు. ప్రతి ఏటా దీన్ని సమీక్షిస్తారు. లక్ష్యాలు చేరుకునేందుకు అవసరమైన సూచనలతో ఉపాధ్యాయులకు పుస్తకాలు ఇస్తారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువు చెప్పడానికి ఒక విద్యార్థిపై సగటున రూ.18వేలు ఖర్చవుతోందని, దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రయివేటు పాఠశాలలు హేతుబద్ధంగా ఫీజులు నిర్ణయించాలని మంత్రి అన్నారు. ■

# ఏపీలో డబ్బున్నవారికే మంచి చదువు



ప్రజల అభివృద్ధికి మూలమైన విద్యావ్యవస్థ పట్ల ఏపీ సర్కారు తీవ్ర నిర్లక్ష్యంతో వ్యవహరిస్తోందని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్కూళ్లలో ఒక్కో విద్యార్థి మీద రూ.40,000 – 50,000 ఖర్చు చేస్తున్నా పనికొచ్చే చదువులు లేవన్నారు. డబ్బున్నవారికే మంచి చదువు అనే ధోరణిలో వ్యవహరిస్తున్న చంద్రబాబు, విద్యామంత్రి గంటా శ్రీనివాసరావు.. విద్యావ్యవస్థను పట్టించుకోవటమే మానేశారన్నారు. 12 జిల్లాల్లో రెగ్యులర్ డీఈవోలు లేకుండానే స్కూళ్లు నడిపించేస్తున్నారన్నారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అని హామీ ఇచ్చి ఇప్పుడు పాఠశాలల్లో విద్యార్థుల నమోదుకే పరిమితమయ్యారన్నారు. రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లు అధ్వాన్నంగా ఉన్నా పట్టించుకోవటం లేదని, 985 ఎస్సీ హాస్టళ్లలో 310 ఇప్పటికే రద్దు చేశారని అన్నారు. విద్యావ్యవస్థను పాలకులు ధ్వంసం చేస్తుండటంతో పేదలు మంచి చదువుకు దూరమవుతున్నారని, కుల, ఆర్థిక వివక్షలు సమాజంలో పెరుగుతున్నాయని అన్నారు.

విజయవాడలోని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన పార్టీ స్టీరింగ్ కమిటీ సమావేశానికి బాబ్జీ అధ్యక్షత వహించారు. అనంతరం వివరాలను మీడియాకు విడుదల చేశారు.

**అవినీతిపై ఏం సమాధానం చెబుతారు? తక్షణం 'పౌర సేవల' చట్టం తీసుకురండి**

అవినీతిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానంలో ఉందన్న సర్వేపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమాధానం చెప్పాలని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ డిమాండ్ చేసింది. ఏపీని దేశంలోనే గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నానన్న చంద్రబాబు.. అవినీతిలో మాత్రం ఆ పనిచేస్తున్నారని నేతలు అన్నారు. కేంద్రీకృత పాలన, లంచగొండి ప్రభుత్వ కార్యాలయాల వల్ల రాష్ట్రం అవినీతిమయమైపోతోందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ పలుమార్లు హెచ్చరించినా బాబు పట్టించుకోలేదన్నారు. లోక్‌సత్తా కొన్నేళ్లుగా (రైట్ టూ సర్వీసెస్ – ఆర్టీఎస్/సర్వీస్ గ్యారంటీ) చట్టాన్ని వెంటనే తీసుకురావాలన్నారు.

పౌర సేవల చట్టం ద్వారా ప్రతి ప్రభుత్వ ఆఫీసులో అందించే సేవల వివరాలను సిటిజన్ ఛార్టర్లుగా బోర్డు పెట్టాలని, ప్రతి పనికీ గడువు పెట్టి ఆలోగా పనిచేయకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారం దరఖాస్తుచేసుకున్న ప్రజలకు చెల్లించాలని బాబ్జీ స్పష్టం చేశారు. అవినీతి బండారం బైటపడిందని పైపైన సిటిజన్ ఛార్టర్లు అమలు చేయాలంటే కుదరదని, వాటిని చట్టబద్ధం చేయాలని అన్నారు. ఇవి చేయటం ఆపి 'యాప్'ల పేరుతో ముఖ్యమంత్రి ప్రజల్ని పక్కదోవపట్టిస్తున్నారన్నారు. చంద్రబాబు పాలనలో టెక్నాలజీ, బోలెడంత సమాచారం ఉంటోందిగానీ, వాస్తవాలు కరువయ్యాయన్నారు. టెక్నాలజీ వల్ల పారదర్శకత పెరుగుతుందని, కానీ రోజువారీ అవినీతి పోవాలంటే పౌర సేవల చట్టం తేవాల్సిందేనని స్పష్టం చేశారు. అక్షయగోల్డ్, అగ్రిగోల్డ్ బాధితులను తక్షణం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రత్యేకహోదాపై దగా చేసిన ముఖ్యమంత్రి, మంత్రులు.. ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనకబాటుతనంపై ఉత్తరాంధ్ర, రాయలసీమ వెనకబాటుతనంపై కనీసం స్పందించటం లేదని బాబ్జీ అన్నారు.

సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరి బాలసుబ్రమణ్యం, పార్టీ నాయకులు నాగేంద్రబాబు, చెన్నుపాటి వజీర్, మాదాసు భానుప్రసాద్, దుర్గ, రాజ్యలక్ష్మి, వెంకటరమణ (బాబు), చంద్రశేఖర్, రామారావు, డేవిడ్, అశోక్‌కుమార్, రవితేజ, సురేష్ తదితరులు పాల్గొన్నారు. ■

# బడి చదువుల్లో రెడ్‌జోన్‌లో తెలంగాణ



పాఠశాల విద్య నాణ్యత సూచిక (ఎస్ఈక్యూఐ)లో తెలంగాణ అట్టడుగున్న ఉన్నట్టు నీతి ఆయోగ్ తెలిపింది. ముఖ్యంగా విద్యార్థులు నేర్చుకునే స్థాయి దారుణంగా ఉన్నట్టు వెల్లడించింది. సర్కారు బడుల తీరు వల్ల.. రాష్ట్రంలో పేదపిల్లలు నాణ్యమైన విద్యకు దూరమవుతున్నారని స్పష్టంచేసింది. రాష్ట్రాల మధ్య పోటీని పెంచి, తద్వారా నాణ్యమైన విద్య అందించే అవకాశంపై కొన్ని నెలలుగా నీతి ఆయోగ్ కసరత్తు చేస్తోంది. 34 రకాల కొలమానాలను పరిగణలోకి తీసుకొని.. 33 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు ర్యాంకులు కేటాయించింది. ఆమధ్య జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో కూడా విద్యారంగంలో ర్యాంకుల గురించి నీతి ఆయోగ్ వివరించింది. నాణ్యమైన విద్యలో 28.81శాతం మార్కులతో 28వ స్థానంలో నిలిచిన తెలంగాణ రెడ్‌జోన్‌లో ఉందని నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగడియా తెలిపారు.

తెలంగాణలో సర్కారు బడుల్లో 22లక్షల మంది చదువుతున్నారు. వారిలో ఎక్కువమంది పేద, అణగారినవర్గాల కుటుంబాల నుంచి వచ్చినవారే. మరోవైపు, ప్రయివేటు పాఠశాలల్లో సైతం విద్యాప్రమాణాలు గొప్పగా లేవని ఇతర నివేదికలు స్పష్టంచేస్తున్నాయి. ■

## మన విద్యార్థుల పరిస్థితి ఇదీ

**5, 8వ తరగతుల విద్యార్థులు**

**2వ తరగతి పుస్తకం చదివే స్థాయి (శాతాల్లో)**

| సంవత్సరం | 5వ తరగతి (ప్రభుత్వ-ప్రయివేటు) | 8వ తరగతి (ప్రభుత్వ) |
|---|---|---|
| 2010 | 53.9 - 67.8 | 82.5 |
| 2012 | 53.3 - 58.3 | 83.6 |
| 2014 | 53.7 - 55.7 | 73.9 |
| 2016 | 40.0 - 59.1 | 71.7 |


## సబ్జెక్టులవారీగా జవాబులు గుర్తించినవారి శాతం (ఎన్‌సీఈఆర్‌టీ సర్వే ప్రకారం)

| రాష్ట్రం | ఆంగ్లం | గణితం | సైన్స్ | సోషల్ |
|---|---|---|---|---|
| తెలంగాణ | 39 | 40 | 36 | 48 |
| జాతీయ సగటు | 41 | 40 | 43 | 47 |

# నిరుద్యోగానికి బీజం బడి చదువుల్లోనే

స్కూలు స్థాయిలో నాణ్యమైన చదువు అందకపోతే ఆర్థికమందగమనం వల్ల తలెత్తే నష్టాలు తీవ్రతరమవుతాయని ఓ నివేదిక హెచ్చరించింది. పదిహేనేళ్ల క్రితంతో పోలిస్తే భారత్‌లో ఇప్పుడు గ్రాడ్యుయేట్ స్థాయిలో ఉన్నవారిలో విద్యాప్రమాణాలు తక్కువగా ఉన్నాయని తెలిపింది. పాఠశాల స్థాయిలో చదువు సక్రమంగా లేకపోవటం ఇందుకు మూల కారణంగా పేర్కొంది. సరైన స్కూలు విద్యకలేకపోవటంతో.. అసలే అంతంత మాత్రంగా ఉన్న ఉన్నత విద్యలో నేర్చుకునే శక్తి ఇంకా తగ్గిపోతోంది. దీనివల్ల, చదువుకున్న నిరుద్యోగులు పెరుగుతున్నారు. ఆర్థికాభివృద్ధి వేగం కూడా దీర్ఘకాలిక పరిణామంలా తగ్గుతున్న నేపథ్యంలో ఇది చాలా ఆందోళనకర పరిణామమని వ్యాఖ్యానించింది.






అసోచామ్ (అసోసియేటెడ్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా) విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, పాఠశాల స్థాయిలో సరైన విద్య అందకపోవటం వల్ల ఐఐఎం, ఐఐటీ గ్రాడ్యుయేట్ల స్థాయి కూడా పడిపోతోంది. బడి చదువులు దిగజారటానికి విద్యావిధానాలతోపాటు.. సరైన ప్రమాణాలున్నవాళ్లు బోధనారంగంలోకి రాకపోవటం కూడా ఒక కారణం. స్కూలు విద్యలాగే ఉన్నత విద్య కూడా దారుణంగా ఉంది. కార్పొరేట్ ఉద్యోగాలకు తగ్గట్టు ఏమాత్రం లేదు.

దేశంలో ఉన్నతస్థాయి చదువులుగా భావిస్తున్న కొన్ని డిగ్రీల గురించి అసోచామ్ కళ్లు తిరిగే వాస్తవాలను బయటపెట్టింది.

ఎంబీయే గ్రాడ్యుయేట్లలో అతికొద్దిమందికి తప్ప మిగతావారికి ఉద్యోగాలు దొరకటం లేదని తెలిపింది.

"ప్రతిష్టాత్మక ఐఐఎం వంటి కొన్ని అగ్రశ్రేణి బిజినెస్ స్కూళ్లను మినహాయిస్తే.. చాలా బిజినెస్ స్కూళ్లలో చదివిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పునాది లేని చదువులతో ఈ బిజినెస్ స్కూళ్లతో చేరి గ్రాడ్యుయేట్లు అయినవారికి ఉద్యోగాలే దొరకటం లేదు. చచ్చీచెడి ఉద్యోగాలు సంపాదించినా వారి జీతాలు మాత్రం రూ.10వేల కంటే తక్కువగా ఉంటున్నాయి'' అని నివేదికలో అసోచామ్ అభిప్రాయపడింది. 'నిజానికి దేశంలో దాదాపు 5,500 బిజినెస్ స్కూళ్లున్నాయి. ఇక గుర్తింపులేనివి కూడా కలిపితే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. వీటి చదువుల్లో నాణ్యత మాత్రం నానాటికీ తీసి కట్టవుతోంది' అని అసోచామ్ సెక్రటరీ జనరల్ ఆందోళన వ్యక్తం చేశారు.

బడి చదువుల్లో నాణ్యత లేకపోయినా కొన్ని ప్రతిష్టాత్మక బిజినెస్ విద్యాసంస్థల్లో ఉన్నత విద్యాభ్యాసం చేసేవారు ఎలాగోలా అవకాశాలు పొందగలుగుతున్నారని, కానీ పాఠశాలలోనూ, బిజినెస్ స్కూళ్లలోనూ నాసిరకం చదువులు పొందినవారిలో ఉద్యోగాలకు పనికొచ్చేవారి సంఖ్య బాగా తక్కువగా ఉంటోందని నివేదిక అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో, పాఠశాల విద్యతో మొదలుపెట్టి మొత్తం విద్యావ్యవస్థనే ప్రక్షాళన చేయాలని సూచించింది.

**నివేదికలోని ముఖ్యాంశాలు:**

● దేశంలో ప్రధాన 20 బిజినెస్ స్కూళ్లను మినహాయిస్తే మిగతావాటి నుంచి ఉత్తీర్ణత సాధిస్తున్న ఎంబీయే గ్రాడ్యుయేట్లలో 7 శాతం మందికే చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగాలు లభిస్తున్నాయి. ● మరో విషయమేమంటే, ఈ గ్రాడ్యుయేట్లలో 7శాతం మాత్రమే ఉద్యోగానికి నిజంగా పనికొస్తున్నారు. ● గడచిన రెండేళ్లలో ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా, లక్నో, అహ్మదాబాద్, హైదరాబాద్, డెహ్రాడూన్‌లలో దాదాపు 200 బిజినెస్ స్కూళ్లను మూసివేశారు. ఈ ఏడాది మరో 120 స్కూళ్లను మూసివేసే అవకాశముంది. ● 2014-16 మధ్య క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు ఏకంగా 45 శాతం పడిపోయాయి కూడా. ● రెండేళ్ల ఎంబీయే కోసం సగటున ప్రతి విద్యార్థీ రూ.3-5లక్షలు ఖర్చు చేస్తున్నారు. కానీ వారి జీతం నెలకు రూ.8-10వేలు మాత్రమే ఉంటోంది. ■

# విస్తరిస్తున్న షాడో విద్య

- డాక్టర్ శంకర్ పారిపెలి
శేఖర్ శర్మ ఏటూర్లి

ప్రధాన స్రవంతి విద్యకు సమాంతరంగా నిర్వహింపబడుతున్న ప్రైవేటు అనుబంధ ట్యుటోరియల్ విద్య నేడు ప్రపంచవ్యాప్తంగా షాడో విద్యగా ప్రాచుర్యంలో ఉంది. పాఠ్య ప్రణాళికలోను, మూల్యాంకన విధానాలలోను, విస్తరణలోను దాదాపుగా ప్రధాన స్రవంతి విద్యను అనుకరిస్తూ నిర్వహించబడుతున్న ఈ ప్రైవేటు ట్యుటోరియల్ వ్యవస్థను యునెస్కో ఛైర్ ప్రొఫెసర్ మార్క్ బ్రే ఆసియా అభివృద్ధి బ్యాంక్ సౌజన్యంతో రూపొందించిన నివేదికలో షాడో విద్యగా పేర్కొన్నారు. దశాబ్దాల తరబడి విధాన రూపకర్తలు రాజకీయ నాయకత్వాలు షాడో విద్య పట్ల ఉదాసీన వైఖరి వహించి దీని ఉనికిని, విస్తరణను ఉద్దేశపూర్వకంగా గుర్తించలేదు. దీంతో దానికి సంబంధించిన పరిశోధనలు, అధ్యయనాలు, విద్యా విధానాల్లో ప్రస్తావనలు అరుదుగా కనిపిస్తాయి.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల్లో ముఖ్యంగా తూర్పు, దక్షిణాసియా దేశాలలో లక్షల కోట్లల్లో వ్యాపారాన్ని నిర్వహిస్తున్న షాడో విద్యావ్యవస్థ నేడు ప్రధాన స్రవంతి విద్యకు సవాలుగా మారింది. వివిధ దేశాల ఆర్థిక, సామాజిక స్థితిగతులను, విద్యార్థుల కుటుంబాల జీవన సరళిని, విద్యావ్యవస్థలో అత్యంత కీలక అంశాలైన తుల్యత (ఈక్విటీ), సమ్మిళిత (ఇంక్లూజివ్‌నెస్)లను తీవ్రస్థాయిలో ప్రభావితం చేస్తున్న షాడో విద్యను విధాన రూపకర్తలు, ప్రభుత్వాలు ఇక ఏమాత్రం ఉపేక్షించడం సాధ్యపడదనేది సత్యం. దక్షిణ కొరియాలో హ్యాగ్వన్ పేరుతో, జపాన్‌లో జేయూకేయూగా, భారత్, హాంకాంగ్‌లలో స్టార్ ట్యూటర్స్‌తో కార్పొరేట్ సంస్థలు నిర్వహిస్తున్న ప్రైవేట్ ట్యుటోరియల్స్.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయి. కుటుంబాల నెలసరి లేదా వార్షిక ఆదాయాలలో దాదాపు మూడవ వంతును కొల్లగొడుతున్నాయి. ముఖ్యంగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి కుటుంబాలను తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నాయి. కమ్యూనిస్టు దేశాలైన చైనా, వియత్నాంలలో ఇతర దక్షిణాసియా దేశాలైన పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంకలలో సైతం షాడో విద్య గణనీయమైన స్థాయిలో విస్తరించడం గమనార్హం. షాడో విద్య ప్రభావం తీవ్రస్థాయిలో ఉన్న దక్షిణ కొరియాలో అనేకమంది సెకండరీ, ఆపై స్థాయి విద్యార్థులు ఆత్మహత్య ఆలోచనలు కలిగివున్నారని అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. భారత్‌లో సైతం ఇటీవల మానసిక ఒత్తిడిని జయించలేక ఆత్మహత్యను ఆశ్రయించిన



17 ఏళ్ల ఐఐటీ ప్రవేశపరీక్ష విజేత కీర్తి తనఆత్మహత్య లేఖలో ప్రైవేటు ట్యుటోరియల్ వ్యవస్థను మూసివేయండని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రివర్యులను అభ్యర్థించింది. దీన్నిబట్టి ప్రైవేటు ట్యుటోరియల్ వ్యవస్థలో శిక్షణ పొందుతున్న లక్షలాదిమంది విద్యార్థుల మనోవ్యథ అర్థం చేసుకోవచ్చు.

దేశంలో రోజురోజుకు విస్తరిస్తున్న షాడో విద్య క్రమబద్ధీకరణకు, పర్యవేక్షణకు పటిష్టమైన చట్టాలు, నియమాలు లేవు. దీనివల్ల ఏ విధమైన పన్నులు ప్రభుత్వానికి చెల్లించకుండా లక్షల కోట్ల వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాయి. 2013 జూన్ మాసంలో 'అసోచామ్' ప్రైవేటు ట్యుటోరియల్ వ్యవస్థపై నివేదిక విడుదల చేసింది. దీని ప్రకారం, 2015లో షాడో విద్య భారత్‌లో నిర్వహించిన వ్యాపారం విలువ దాదాపు 2.3లక్షల కోట్లు. ఇది 2016-17 ఆర్థిక సంవత్సరానికిగాను విద్యారంగానికి భారత ప్రభుత్వం కేటాయించిన బడ్జెట్ (రూ.72,394కోట్లు)కు దాదాపు మూడు రెట్లు. ఈ నివేదిక ప్రకారం మెట్రో నగరాలలో 87శాతం మంది ప్రాథమిక స్థాయి విద్యార్థులు, 95శాతం మంది విద్యార్థులు ప్రైవేటు ట్యూషన్స్‌పై ఆధారపడుతున్నారు. ఇలా తల్లిదండ్రులు ప్రాథమిక విద్య కోసం ఒక్కో విద్యార్థిపై దాదాపు నెలకు రూ.3000, సెకండరీ విద్యకు దాదాపు రూ.5000 వెచ్చిస్తున్నారు. జాతీయ శాంపిల్ సర్వే, 2014లో నిర్వహించిన మరొక సర్వే సోషల్ కన్జంప్షన్ ఎడ్యుకేషన్ 71వ రౌండ్ ప్రకారం దేశవ్యాప్తంగా సగటున 26శాతం మంది ప్రాథమిక స్థాయి నుంచి కాలేజీ స్థాయి వరకు విద్యార్థులు ప్రైవేట్ ట్యూషన్స్‌కు హాజరవుతున్నారు. సగటున కుటుంబాలు 10 నుంచి 11శాతం ఆదాయాన్ని దీని కోసం వెచ్చిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద వర్గాలు సైతం గణనీయ సంఖ్యలో తమ పిల్లలను ప్రైవేట్ శిక్షణలకు పంపుతున్నారనే అంశాన్ని వెల్లడించింది. భారత్‌లో షాడో విద్య

కుటీర స్థాయి నుంచి కార్పొరేట్ స్థాయి వరకు భారీగా విస్తరించడానికి కీలకమైన చోదక శక్తులను ఈ విధంగా అర్థం చేసుకోవచ్చు..

1. విద్యాసంస్థల్లో నిర్వహిస్తున్న బోధనకు, పోటీపరీక్షల అవసరాలకు మధ్య తీవ్రమైన అంతరం ఉంది. దీంతో ఈ విద్యాసంస్థలు ముఖ్యంగా ప్రభుత్వ ప్రధాన స్రవంతి విద్యాసంస్థలు తమ పిల్లలకు అసంపూర్ణమైన విద్యను అందిస్తున్నాయని తల్లిదండ్రులు భావించటం 2. మార్కెట్ ఆర్థిక విధానాల అమలు కారణంగా విద్యావిధానాల రూపకల్పన, అమలులో ప్రైవేట్ కార్పొరేట్ సంస్థల జోక్యం మితిమీరి, విద్యలో కేవలం మార్కులు లేదా ర్యాంకుల కోసం బోధించే పద్ధతులకు ప్రాధాన్యం పెరగటం 3. వివిధ విద్యాస్థాయిల్లో ఎంపికల కోసం నిర్వహించే అధిక ప్రాధాన్యంగల ప్రామాణిక పరీక్షలకు తమ పిల్లలను సిద్ధం చేయటం ప్రైవేట్ శిక్షణాసంస్థలకవల్ల మాత్రమే సాధ్యమవుతుందని తల్లిదండ్రులు భావించడం 4. ప్రభుత్వ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న కొంతమంది ప్రతిభావంతులైన బోధనాసిబ్బంది స్వలాభాపేక్షతో ప్రైవేట్ శిక్షణలను నిర్వహించడం లేదా ప్రైవేట్ సంస్థలలో సేవలు నిర్వహించి తల్లిదండ్రులను ఆకర్షించడం 5. వారసత్వంగా కొనసాగుతున్న లక్షణాలు, తోటివారితో పోలిక, పోటీపడటం కారణంగా తల్లిదండ్రులు తమ పిల్లల నుంచి స్థాయికి మించిన ప్రదర్శనను కోరుకోవడం. వారికి అత్యాశతో కూడుకున్న లక్ష్యాలను నిర్దేశించి, వాటి సాధనకు ప్రైవేట్ శిక్షణను ఆశ్రయించడం. 6. పెరిగిన మధ్యతరగతి కుటుంబాల ఆదాయం, చిన్న కుటుంబాల వ్యవస్థలు అధికం కావడం.

ఈ కారణాల దృష్ట్యా షాడో విద్యావ్యవస్థను ఆశ్రయిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు కింది విషయాలను అర్థం చేసుకోవాలి. షాడో విద్యావ్యవస్థ, వాస్తవంగా అనుబంధ శిక్షణ అవసరమైన పేద, ప్రతికూల పరిస్థితుల విద్యార్థులకు ఏమాత్రం సహాయపడకపోగా, ఎగువ మధ్యతరగతి, సంపన్న వర్గాల పిల్లల పోటీతత్వ ప్రయోజనాన్ని కాపాడుతూ, అది మరింత అభివృద్ధి చెందేందుకు దోహదపడుతున్నది. షాడో విద్య విద్యార్థుల తల్లిదండ్రులు జీవనశైలి ఆధిపత్య ధోరణిని ప్రదర్శిస్తూ వారిని క్రీడలు, కళలు, సామాజిక సేవ వంటి ఆరోగ్యవంతమైన వ్యాపకాలకు దూరం చేస్తున్నారు. పోటీతత్వం వల్ల కలిగే ప్రయోజనం కన్నా ఒత్తిడి వల్ల కలిగే నష్టం అధికం కావడం వల్ల డిప్రెషన్‌కు లోనై, విద్యార్థులు తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవడానికి షాడో విద్య కారణమవుతున్నది. ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ గ్రహీత అమర్త్యసేన్ 2009లో ప్రటాచి ట్రస్ట్ నివేదికలో భారత్‌లో విస్తరిస్తున్న షాడో విద్యపై చేసిన వ్యాఖ్యానాలను విధాన రూపకర్తలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలి.

సేన్ మాటల్లో.. ప్రైవేట్ అనుబంధ శిక్షణపై ఆధారపడటం దేశ పురోభివృద్ధికి వ్యతిరేకం. ఒకరకంగా ఇది నిజమైన తిరోగమన చర్య. ప్రైవేట్ శిక్షణల మీద ఆధారపడే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది కుటుంబాల ఆదాయంలో కొంత పెరుగుదల వల్ల వారికి లభించిన ఆర్థిక స్తోమత వల్ల మాత్రమే కాదు.. ప్రైవేట్ శిక్షణ అనేది అత్యంత అనివార్యమైనదని, దీన్ని ఏ విధంగానైనా భరించాల్సిందేననే భావన తల్లిదండ్రుల్లో తీవ్రతరం కావడం వల్ల సంభవించిన పరిణామం. ప్రైవేట్ శిక్షణ– విద్యార్థులను ఉన్నవారిగా, లేనివారుగా విభజిస్తున్నది. విద్యావ్యవస్థలో ఉపాధ్యాయుల పాత్రను తక్కువ చేసి చూపుతూ వారి ప్రాధాన్యాన్ని మసకబారుస్తున్నది.

ఈ కారణాల దృష్ట్యా, విద్యావిధాన రూపకర్తలు, ప్రభుత్వాలు సత్వరమే షాడో విద్యావ్యవస్థ ఉనికిని, విస్తరణను గుర్తించాలి. దీనివల్ల ఉత్పన్నమవుతున్న ఆర్థికపరమైన, సామాజికపరమైన అసమానతలను నిలువరించేందుకు తగిన చట్టాలను, నిబంధనలను అమలులోకి తేవాలి. ఈ విద్యావ్యవస్థ వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాలి. ఎంపికల కోసం నిర్వహించే పోటీపరీక్షలు, మూల్యాంకన విధానాలలో సంస్కరణలను చేపట్టాలి.


షాడో విద్యను పూర్తిస్థాయిలో నిలువరించిన స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఫిన్లాండ్‌లు అనుసరిస్తున్న విధానాలను విధానకర్తలు పరిశీలించాలి.

ముఖ్యంగా దిగువ, మధ్యతరగతికి చెందిన తల్లిదండ్రులు, ప్రభుత్వ విద్యాసంస్థల పనితీరుపై అసంతృప్తితో ప్రైవేటు విద్యాసంస్థలను, ట్యుటోరియల్ వ్యవస్థను ప్రత్యామ్నాయంగా ఎంచుకోవడం సమర్థనీయమైన చర్య కాదు. ప్రభుత్వ విద్యాసంస్థల నుంచి ఆశిస్తున్న ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులతో, పాఠశాల యాజమాన్య కమిటీలతో నిరంతరం చర్చిస్తూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు క్రియాశీలకంగా వ్యవహరించాలి. కార్పొరేట్ విద్యాసంస్థలు సృష్టిస్తున్న మాయాజాలంతో తమ పిల్లలకు చిన్న వయసులోనే కృత్రిమ మేధస్సును సృష్టించే కోచింగ్ పద్ధతులకు స్వస్తి పలకాలి. రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు అంటే, తమ సామర్థ్యాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ఎదిగేందుకు కావలసిన విద్యను, నైపుణ్యాలను పిల్లలు అందించటమేనని గుర్తించి, అందుకోసం విద్యావిధాన రూపకర్తలు, తల్లిదండ్రులు కృషి చేయాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి.

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో) ■

# వాసి గల ఉపాధ్యాయులేరీ?

- చుక్కా రామయ్య




కొన్నాళ్లక్రితం హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పబ్లిక్‌స్కూల్స్ సదస్సు ఇచ్చిన పిలుపు దేశ భవిష్యత్తుకు మేలుకొలుపు. నాణ్యమైన ఉపాధ్యాయులను తయారుచేయడంపై ప్రభుత్వాలు దృష్టి సారించాలని 77వ ఇండియన్ పబ్లిక్ స్కూల్స్ కాన్ఫరెన్స్ (ఐపీఎస్‌సీ) విజ్ఞప్తి చేసింది. 21వ శతాబ్దంలో విద్యే దేశ భవిష్యత్తుకు చుక్కాని అని అందరూ గుర్తించడం వాస్తవమేగానీ, ఆ దిశగా గట్టి అడుగులు పడకపోవటంతో సదరు పాఠశాలల ప్రధానోపాధ్యాయులే చివరకు ప్రాధేయపడాల్సి వచ్చింది.

దేశం మొత్తం మీద 15లక్షల పైచిలుకు స్కూల్స్ ఉన్నాయి. 38వేల కళాశాలలు, 760 విశ్వవిద్యాలయాలు, 12వేల శిక్షణాసంస్థలున్నాయి. పైగా ప్రభుత్వాల అవసరం ఉన్నప్పుడు ఉపాధ్యాయ, అధ్యాపక నియామకాలు జరుపుతున్నాయి. సమస్యల్లా నాణ్యమైన ఉపాధ్యాయుల విషయంలోనే. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలతో సంబంధం లేకుండా ఐదవ తరగతిలో ఉన్న విద్యార్థి రెండో తరగతి పుస్తకాన్ని చదవలేకపోవడాన్ని పలు సర్వేలు ఎత్తిచూపాయి. దీనిని బట్టి ఉపాధ్యాయుల బోధన ఏ స్థాయిలో ఉన్నదో స్పష్టం అవుతోంది. గత దశాబ్ది కాలంలో ప్రైవేటు విద్యారంగంలో మౌలిక వసతులకు కొదవ లేదు. కానీ ఉపాధ్యాయ వర్గంలో విద్యాప్రమాణాలకు నూతన భవంతులు, సాంకేతిక పరిజ్ఞానం గీటురాయి కాదు. పిల్లలకు చదువు బాగా రావాలంటే మంచి టీచరు ఉండాలని అందరూ అంగీకరిస్తారు. అయితే దీనిని అమలులోకి తీసుకురావడంలో చిత్తశుద్ధి కన్పించదు. ప్రభుత్వాల దృష్టిలో టీచర్ రిక్రూట్‌మెంట్, కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ ఒక్కటే. నిరుద్యోగ లోకంలో అసంతృప్తి ప్రబలినప్పుడు ప్రభుత్వాల వద్ద ఉండే నియామకాల ఆయుధాలివి. అంతే తప్ప ఉపాధ్యాయ నియామకాలపై ఏ ప్రభుత్వానికీ ప్రత్యేక శ్రద్ధ కన్పించదు.

మంచి విద్యార్థులు తయారుకావాలంటే మంచి ఉపాధ్యాయులను ఎంపిక చేయాలన్న చిత్తశుద్ధి ఉండాలి. విద్యార్థిలోని నిజమైన ప్రతిభను వెలికితీయాలంటే మెరికల్లాంటి టీచర్లు ఉండాలి. అసాధారణ తెలివితేటలు గల విద్యార్థులకు

## ఐఐటీలు, ఐఐఎంల స్థాయిలో ఉపాధ్యాయ విద్యాసంస్థలుండాలి

దేశంలో పాఠశాల విద్యావ్యవస్థ బాగుపడటానికి సరైన ఉపాధ్యాయులు కీలకమని, కేవలం ఉద్యోగం కోసం వచ్చేవారిని కాకుండా బోధనా వృత్తిపై నిజమైన ఆసక్తి ఉన్నవారినే ఉపాధ్యాయులుగా ఎంచుకోవాలని దేశంలోని ప్రముఖ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూచించారు. ఐఐటీలు, ఐఐఎంల స్థాయిలో ఉపాధ్యాయ విద్యాసంస్థలను తయారుచేయాలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ ఉపాధ్యాయులను సృష్టించటంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్వరం దృష్టి పెట్టాలన్నారు. ఇలాంటి ఏర్పాట్లు లేకపోతే దాదాపు 30 తరాలు నష్టపోతాయన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన 77వ ఇండియన్ పబ్లిక్ స్కూల్ కాన్ఫరెన్స్ (ఐపీఎస్‌సీ)లో వారు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులను ఎంపిక చేసుకునేముందు ప్రభుత్వాలు, ప్రైవేటు యాజమాన్యాలు అత్యంత శ్రద్ధతో వ్యవహరించటంతోపాటు ఉద్యోగావకాశాలను పెంచే కోర్సులను ప్రవేశపెట్టాలని అన్నారు. ఐఐటీలు, ఎన్ఐటీలే లక్ష్యంగా ఇంటర్ లేదా 12వ తరగతిలో ఎక్కువమంది సైన్స్ గ్రూపుల్లో చేరుతున్నారని, వారిలో చాలామంది లక్ష్యాన్ని చేరలేక నిరాశకు గురవుతున్నారని వారన్నారు. ఇంటర్‌లో చేరే ముందు ఆప్టిట్యూడ్ పరీక్ష నిర్వహించి సైన్స్, ఆర్ట్స్, కామర్స్ గ్రూపులను ఎంచుకునేలా చేయాలన్నారు.

ఎవరైనా చదువు చెప్పగలరు. మామూలు విద్యార్థిలో నిద్రాణంగా ఉన్న ప్రతిభను బైటికి తీయాలంటే మంచి ఉపాధ్యాయులు కావాలి. మంచి టీచర్ క్లాస్ చెప్పడంతోనే తన పని అయిపోతుందని భావించడు. విద్యార్థిలో నిబిడీకృతమైన ప్రతిభను బైటికి తీసుకు వచ్చేందుకు ఉపాధ్యాయుడు ఎన్నో రూపాలలో వారికి దగ్గరయ్యేందుకు ప్రయత్నిస్తాడు. కొన్నిసార్లు విద్యార్థుల ప్రతిభకు పదును పెట్టేందుకు సవాళ్లు విసురుతాడు. ఇన్ని ప్రక్రియల్లో ఆరితేరిన ఉపాధ్యాయులను ఎంపిక చేయడం మాటలు కాదు.

ఉపాధ్యాయ శిక్షణా సంస్థలు ఇచ్చే సర్టిఫికెట్లు వాహనాలకు ఇచ్చే డ్రైవింగ్ లైసెన్సులుగా మారాయి. డ్రైవింగ్ లైసెన్స్ ఉన్నంత మాత్రాన ప్రతి ఒక్కరూ వాహనాలను నైపుణ్యంతో నడపగలరని అర్థం కాదు. నిజమైన నైపుణ్యాలుంటేనే మంచి వాహన చోదకుడవుతాడు. అలాగే ఉపాధ్యాయ శిక్షణ సర్టిఫికెట్లు ఉన్న వారిలో అందరికీ తగిన సామర్థ్యం ఉండకపోవచ్చు. ఇందుకు రెండు అంశాలు ముఖ్యం – ఒకటి, ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి, ఈ వృత్తిలో ఇమిడిపోగలవారిని ఎంపిక చేయడం. ఈ ప్రక్రియను శిక్షణా సంస్థలకు పరిమితం చేయకుండా కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచే మొదలుపెట్టాలి. అనుభవజ్ఞులైన ప్రొఫెసర్లు తమ వృత్తిలో ఉపాధ్యాయులుగా రాణించగలవారిని అక్కడే గుర్తించాలి. వారి ఆసక్తి, వ్యక్తీకరణ, విషయజ్ఞానంపై అనురక్తి రీత్యా అటువంటివారిని గుర్తించి ఉపాధ్యాయ శిక్షణకు వెళ్లమని ప్రోత్సహించాలి. ఉపాధ్యాయ ఎంపికలు రేపటి అవసరాలకు అనుగుణంగా జరిగితే ఉపాధ్యాయుడి సేవలు పదికాలాల పాటు ఉపయోగపడతాయి. అందుకే ఇండియన్ పబ్లిక్ స్కూల్స్ ప్రిన్సిపాల్స్ సమగ్ర ఉపాధ్యాయ శిక్షణ కోసం ఐఐటీ, ఐఐఎం వంటి అంతర్జాతీయస్థాయి ప్రమాణాలు గల విద్యాసంస్థలను రూపొందించమని కోరింది. పుస్తకాల్లో లేని చదువులను విద్యార్థుల మస్తిష్కాల్లోకి పంపగలిగేవే ఐఐటీలు. భవిష్యత్ అవసరాలను కూడా అర్థం చేసుకుని బోధన జరిపే అలాంటి వ్యవస్థను ఉపాధ్యాయుల శిక్షణకు నెలకొల్పమని ప్రిన్సిపాల్స్ అడగటం అంటే అంతటి ప్రాధాన్యాన్ని నొక్కి చెప్పటమే.

విద్యావ్యవస్థకు ఇంతటి ప్రాధాన్యాన్ని ఇచ్చిన దేశాలు కాలం విసిరే సవాళ్లకు దీటుగా నిలబడుతున్నాయి. ఉత్తర కొరియా తన దాయాది దక్షిణ కొరియాను అణ్వస్త్రాలతో భయపెట్టాలని చూస్తే దక్షిణ కొరియా తన విద్యావ్యవస్థే అస్త్రంగా దీటుగా జవాబుచెప్పగలిగింది. యూరప్‌లోని ఆర్థిక వ్యవస్థల పునాదులు కదిలి పేకమేడల్లా కూలిపోతుంటే విద్యావ్యవస్థ పునాదిగా ఫిన్లాండ్ బలంగా నిలబడగలిగింది. చైనా, జపాన్, దక్షిణ కొరియా దేశాలు మంచి మానవ వనరులను తయారుచేసుకొని అన్ని రంగాలలోను ప్రత్యేకత చూపగలుగుతున్నాయి. ఇక మనదేశంలో 2013–14 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి రూ. 3 లక్షల 25వేల కోట్లను విద్యారంగంపై ఖర్చు పెట్టిన నేపథ్యంలో మెరుగైన ఉపాధ్యాయులను ఈ వ్యవస్థలోకి తీసుకురాకపోతే ప్రపంచంలో 5వ బలమైన ఆర్థిక వ్యవస్థగా అవతరించిన మన సంబరం ఎక్కువకాలం నిలవదు. ప్రిన్సిపాల్స్ సదస్సు చేసిన విజ్ఞప్తిని ఇప్పుడైనా అందిపుచ్చుకుంటేనే స్వర్ణ భారత్‌ను అందించగలం.

(సాక్షి సౌజన్యంతో) ■

## ఓయూపై కేసీఆర్ మౌనం విడ్డూరం

విద్యా బాహుబలి ఉస్మానియా విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలపై ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు మౌనం వహించటం విడ్డూరమని, బాధ్యతారాహిత్యమని లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డా॥ పాండురంగారావు, ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఓయూ సమస్యలపై మాట్లాడకపోవడం, కనీసం సందర్శించకపోవడం శోచనీయమన్నారు. విద్యను అత్యంత ప్రాధాన్యరంగంగా ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు.


**ఇదేం ప్రజాస్వామ్యం, ప్రజాసేవ?**

తమ పార్టీ బలహీనతలను కప్పిపుచ్చుకునేందుకే టీఆర్ఎస్ ప్రభుత్వం బలనిరూపణ కార్యక్రమాలను నిర్వహిస్తోందని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ముస్లిం రిజర్వేషన్లు, కులం పేరుతో ఆదాయం వంటి కార్యక్రమాలతో వచ్చే ఎన్నికల్లో భావోద్రేకాల మధ్య గెలవాలనుకుంటోందన్నారు. రైతులకు న్యాయమైన ధర అందించటం చేతగాని ముఖ్యమంత్రి.. వ్యవసాయాధారిత గ్రామాల అభివృద్ధి గురించి మాట్లాడుతున్నారన్నారు. 'పౌర సేవల' చట్టం, అధికార వికేంద్రీకరణతో పంచాయతీ, వార్డు స్థాయికి అధికారాలు వంటి సంస్కరణలతో ప్రజలకు సేవలందించటం ద్వారా.. కాకుండా ఉచితాలు, ఉద్రేకాల చుట్టూ ఓటు బ్యాంకులను తయారు చేయాలనుకుంటున్నారన్నారు. ఇటీవల వరంగల్‌లో జరిగిన టీఆర్ఎస్ బహిరంగ సభకు వందల కోట్లు బలవంతపు వసూళ్లతో ఖర్చు పెట్టారని, అధికార దుర్వినియోగంతో ఆర్టీసీ బస్సుల్ని మళ్లించారని, దీన్ని ప్రజాసేవ, ప్రజాస్వామ్యం అంటారా? అని ప్రశ్నించారు. ■

# హేతువు వికసిస్తేనే విజ్ఞాన భారతం

- డా॥ కె. శ్రీనివాస్

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన శాస్త్రవేత్తలెవరైనా నోబెల్ బహుమానం పొందితే వారికి నూరుకోట్ల బహుమానం ఇస్తామని చంద్రబాబు నాయుడు ఆఫర్ చేశారు. తిరుపతిలో జరిగిన సైన్స్ కాంగ్రెస్‌లో ఆయన ఈ ప్రకటన చేశారు. శాస్త్ర విజ్ఞానరంగంలో పరిశోధనకు ప్రోత్సాహం అందించడానికి ఆయన తీసుకోవాలనుకుంటున్న చొరవకు అది ఒక సూచన కావచ్చు. మరొకరకంగా తన తపనను వ్యక్తం చేయడానికి ఆయనకు మార్గం తెలియకపోవచ్చు. లేదా మార్గమే లేకపోవచ్చు. శాస్త్ర, సాంకేతికరంగాలు ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉన్నవి కాబట్టి, రాష్ట్ర స్థాయి నాయకులు చేయగలిగింది పెద్దగా ఏమీ ఉండకపోవచ్చు. నోబెల్ పురస్కార గ్రహీతలను కాకపోయినా, ఉత్తమశ్రేణి శాస్త్రజ్ఞులను రూపొందించడానికి కావలసిన పునాదులు పడవలసింది మాత్రం ప్రాథమిక, మాధ్యమిక విద్యాస్థాయిలలోనే.




క్రీడారంగంలో విజయాలు సాధించినవారికి నగదు బహుమానాలు, భూవిరాళాలు ఇవ్వడం మన ప్రభుత్వాలకు, నాయకులకు ఒక అలవాటు. ఆయా క్రీడాకారులు తమకు సొంతంగా ఉన్న అవకాశాలను ఆసరా చేసుకునో, అసాధారణమైన స్థాయిలో శ్రమపడో పతకాలో, విజయాలో తీసుకువస్తారు. మేటి క్రీడాకారులు రూపొందడానికి అవసరమైన ప్రాథమిక సదుపాయాలు కల్పించడం కానీ, పెట్టుబడులు పెట్టడం కానీ ప్రభుత్వాలు చేయవు. విజేతలను సత్కరించడమే తప్ప, విజేతలను తయారుచేసే వ్యవస్థలను నిర్మించడం ప్రభుత్వ విధానాలలో కనిపించదు. ఇప్పుడు శాస్త్ర పరిశోధకులను ప్రోత్సహించే ప్రకటనల విషయంలో కూడా అదే పోకడ కనిపిస్తోంది. క్రీడా మైదానాలు కానీ, ఆటలాడుకునే సమయం కానీ లేకుండానే పాఠశాలలు నడుస్తున్నాయి. అవే పాఠశాలల్లో సైన్స్ విద్యపై అభిరుచిని పెంచే కనీస సదుపాయాలు కూడా ఉండడం లేదు. ప్రయోగశాలలకు కావలసిన సామాగ్రి లేదు, అందుకు డబ్బు వ్యయం చేయడానికి ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలేవీ ఉత్సాహం చూపడం లేదు. అన్ని చదువులూ వృత్తిపరమైన, సాంకేతికమైన కోర్సులకే దారితీస్తున్నాయి తప్ప, ప్యూర్ సైన్సెస్ చదవడానికి సమాజంలో ఒరవడి ఏదీ? ఇంజనీరింగ్ విద్య శాస్త్రరంగానికి చెందినదే అయినప్పటికీ, అందులో సాంకేతికత పాలే ఎక్కువ. మౌలిక పరిశోధన రంగంలోకి వెళ్లాలంటే, ప్యూర్ సైన్సెస్ చదవాలి.

ఒక ఉపగ్రహాన్నో, రాకెట్‌నో ప్రయోగించినప్పుడు శ్రీహరికోటలో వందలాది మంది శాస్త్రజ్ఞులు విజయోత్సాహంతో ఆనందపడటం చూస్తుంటాము. అక్కడ కనిపించే శాస్త్రవేత్తల్లాగా మనమూ కావాలన్న స్ఫూర్తిని ఎందరు విద్యార్థులు తీసుకుంటున్నారు? భౌతిక రసాయన శాస్త్రాల్లో స్నాతకోత్తర విద్యను అభ్యసించడానికి, అందులో పరిశోధనలు సాగించడానికి, అధ్యాపక వృత్తిని స్వీకరించడానికి పిల్లలను మనం ప్రోత్సహిస్తున్నామా?

శాస్త్రవిజ్ఞానం అంటే ఏమిటి? దాని లక్ష్యం ఎట్లా ఉండాలి? అది ప్రయోగశాలల్లో మాత్రమే ముక్కు మూసుకుని తపస్సు చేసేదా? దాని ఆధారంగా మనం పెంపొందించేది సాంకేతికతను మాత్రమేనా? లాఘవాన్ని, సౌలభ్యాన్ని అందించే పరికరాలను తయారుచేయడమేనా? లేక, ఇప్పటితరం పిల్లలపై మనం రుద్దుతున్నట్టు, సైన్స్ అంటే క్షిపణులకు, బాంబులకు, తుపాకులకు సంబంధించిన యుద్ధ పరిజ్ఞానమేనా? ఈ ప్రశ్నలు అర్థరహితంగా కనిపించవచ్చు, భౌతికశాస్త్రాలు, సామాజిక మానవీయ శాస్త్రాలూ వేరు వేరుగా కనిపించవచ్చును కానీ, అవి పరస్పర ప్రభావితాలు. భౌతిక ప్రకృతి, చలన సూత్రాలు మన సామాజిక అవగాహనను కూడా తీర్చిదిద్దుతాయి. శాస్త్రవిజ్ఞానం అన్నది సమాజపు భౌతిక ఆస్తి మాత్రమే కాదు, సమాజ సంస్కారానికి మూలధనం కూడా. చరిత్రను పరామర్శిస్తే, అనేకమంది తత్వవేత్తలు భౌతిక శాస్త్రవేత్తలుగా కనిపిస్తారు, రసాయన, భౌతిక పరిశోధనలను ప్రోత్సహించిన సంస్కార మతాలు కనిపిస్తాయి. మౌఢ్యాన్ని

ఎదిరించి ప్రాణాలర్పించిన హేతువాదులూ తారసపడతారు.

శాస్త్రవిజ్ఞానాన్ని దాని సారాంశం నుంచి విడదీసి, సామాజిక లక్ష్యాల నుంచి వెలిగా చూసినప్పుడు, అది ప్రమాదకరంగా పరిణమిస్తుంది. మంచి సైన్సు, చెడ్డ సైన్సు అని ఉండకపోవచ్చును కానీ, దాని మీద యాజమాన్యం కలిగిన శక్తులలో మంచిచెడులు ఉంటాయి. సమష్టి భవితవ్యాన్ని పణంగా పెట్టే స్వార్థ దృష్టి శాస్త్రవిజ్ఞానాన్ని భస్మాసుర హస్తంగా మారుస్తుంది. పర్యావరణాన్ని, ప్రకృతి నిరంతరాయతను ధ్వంసం చేసే అభివృద్ధి, పర్యవసానాలను యోచించకుండా జరుగుతున్న జీవసాంకేతిక ఆవిష్కరణలు, మానవవినాశనానికి ఆజ్యం పోస్తున్న అణ్వస్త్ర పరిజ్ఞానం, అధిక ఉత్పత్తి పేరిట వ్యవసాయంలో జరిగే రసాయనీకరణ, భూగర్భ జలాల అపరిమిత వినియోగం, భారీ డ్యాముల నిర్మాణం ఇదంతా మనిషి శాస్త్ర విజ్ఞాన పురోగతి సాయంతో చేసుకుంటున్న స్వీయ విధ్వంసమే. ఈ క్రమాన్ని నిరోధించడానికి బలహీనంగానైనా ప్రయత్నిస్తున్న మానవసమాజాలు కూడా శాస్త్రవిజ్ఞానాన్నే ప్రాతిపదికగా చేసుకుంటున్నాయి. కాకపోతే, అది ప్రజానుకూల రాజకీయ, సామాజిక దృక్పథాలు పైచేయిగా అన్వయించే శాస్త్రవిజ్ఞానం.

నవస్వతంత్ర భారతదేశం తన పురోగమనంలో అనుసరించవలసిన ఆదేశిక విలువలను నిర్దేశిస్తూ, రాజ్యాంగం వైజ్ఞానిక అభినివేశాన్ని ప్రముఖంగా గుర్తించింది. అటువంటి స్ఫూర్తి ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సమానత్వాన్ని పెంపొందించగలదని రాజ్యాంగ నిర్మాతలు ఆకాంక్షించారు. పశ్చిమదేశాలు తమ మతవిశ్వాసాలను కొనసాగిస్తూనే, భౌతికవాద శాస్త్రపురోగతి సాధించడానికి కారణం అక్కడ మతం రాజ్యవ్యవహారాల నుంచి అధికభాగం తప్పుకుని, వ్యక్తిగత వ్యవహారాలకు పరిమితం కావడమే. ఒకనాడు రాజ్యపాలనలో ముఖ్యపాత్ర వహించిన మతవ్యవస్థలు, ఆధునిక శాస్త్రవిజ్ఞానం ఆవిష్కరణను తమ శక్తిమేరకు అడ్డుకున్నాయి. అయితే, పారిశ్రామిక విప్లవం, ప్రజాస్వామ్యం వాటితోపాటు ఆవిర్భవించిన వివిధ నవీన భౌతిక, సామాజిక శాస్త్రాలు, వాటిని ఆలంబన చేసుకుని పయనించిన వివిధ జాతులు, సమూహాలు, స్థాపించుకున్న ఆధునిక రాజ్యాలు లౌకికవాద ప్రభుత్వాలను, సమాజాలను సాధ్యం చేశాయి. భారతదేశం ఆ కోవలోకి రాకపోయినా, అటువంటి ఆకాంక్షను తన జాతీయోద్యమంలో భాగం చేసుకున్నది. శాస్త్ర పరిశోధనల కోసం ప్రత్యేకించి అనేక పరిశోధనా సంస్థలను, విద్యాసంస్థలను నవ భారతదేశం ఏర్పాటు చేసుకున్నది. అంతరిక్షపరిశోధనా, అణుపరిశోధనా మొదటి నుంచి భారతదేశానికి ప్రియమైన రంగాలే అయినా, శాంతియుతమైన, పౌర ప్రయోజనాల కోసమన్న వివరణ ఎప్పుడూ జోడించే ఉండేది. కాలం మారుతూ వచ్చింది. మాటలో ఉన్నంత చేతలలో లేకపోయినా లౌకికవాదం వివాదాస్పదం కానే అయింది. మితవాదం అమితమవుతూ వచ్చింది. క్షిపణులు నిర్మించిన శాస్త్రవేత్త, అణ్వస్త్ర ప్రయోగాలు సాధ్యపరచిన శాస్త్రవేత్త కొత్త తరానికి ఆరాధ్యుడయ్యాడు. ఇన్‌శాట్ పరంపర సాధించిన సమాచార విప్లవం కంటె, దూరలక్ష్యాలు ఛేదించే క్షిపణి వాహకాలకే జనం జేజేలు పెరిగాయి. రక్షణ సాధనాల ప్రయోగసంస్థలే సైన్స్ కాంగ్రెస్‌లలో ప్రధాన ఆకర్షణలయ్యాయి. శాస్త్రీయ స్పృహ సమాజంలోకి ఇంకడం అటుంచి, మనుషులు మరింతగా కుంచించుకుపోవడం పెరిగిపోయింది. హేతువాదులు హత్యలకు గురవుతున్నారు. తామరతంపరగా స్వాములు పెరిగిపోతున్నారు. భక్తికి భారీగా మార్కెట్ పెరిగింది. విగ్రహాలు ఆకాశాన్నంటుతున్నాయి. సమస్త సాంకేతిక పరిజ్ఞానమూ జ్యోతిష్యానికి, వాస్తుకి, ప్రవచనాలకీ, కార్తీకదీపోత్సవాలకీ దాసోహమంటున్నది.

ఈ మధ్య పేదల జపం విపరీతంగా చేస్తున్న ప్రధాని మోదీ, బడుగుబలహీనవర్గాలవారికే సైన్స్ ఫలితాలు అందాలని సందేశమిచ్చారు. ప్రజలకు సైన్స్‌ని ఎడం చేసి, దాన్నొక శిష్టరంగంగా మార్చిన తరువాత, అది పేదలకు చేయగలిగే సేవ తక్కువ. భారతదేశంలో శాస్త్రవిజ్ఞాన స్పృహ ఉధృతమై, మానవాళికి ఉపయుక్తమయ్యే అనేక నూతన ఆవిష్కరణలు సాధ్యపడాలంటే, అందుకు పునాదులు క్షేత్రస్థాయి విద్య నుంచి, అట్టడుగు సామాజిక వేదికల నుంచి పడాలి. ఒక శాతం జీడీపీ కూడా లేని ప్రభుత్వ కేటాయింపులు ఇబ్బడిముబ్బడిగా పెరగాలి. గ్లోబల్ పెద్దల అవసరాల కోసమో, జాతీయోన్మాదాన్ని పెంచడానికో కొన్ని రంగాలలో పెట్టుబడులు కుమ్మరించడం కాక, ప్రజానుకూల విజ్ఞానంతో సమతుల్య అభివృద్ధిని సాధించాలి. ప్రజలలో హేతుదృష్టి బలపడాలి. ఉత్సాహానికి ప్రోత్సాహం, విజయాలకు గుర్తింపు దొరకాలి. భారతీయ మేధ పరదేశాలకు వలస వెళ్లకుండా, జన్మభూమిలోనే సార్థకం కావాలి. సకల అంతరాలూ క్షీణించిపోవాలి. చమత్కారాలూ విన్యాసాలూ చేసే రంగంగా ముద్రపడకుండా సైన్స్ మానవీయం కావాలి. ఆ స్పృహ ఉన్నప్పుడు, క్యాష్‌లెస్ కావడం కంటె క్యాస్ట్ లెస్ కావడంలోనే భారతదేశ పురోగతి ఉన్నదని మనకు తెలుస్తుంది. అణగారిపోయిన మేధలన్నీ వికసించి, విజ్ఞానసంపదతో దేశం సుభిక్షమవుతుంది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో) ■

# చిన్నారులకు కూడా ఇంత చక్కగా అర్థమైన విషయాలు దేశాన్ని పాలించే గాడిదలకు అర్థంకావటం లేదెందుకు?: జేపీ



దేశ జనాభాలో 70శాతానికి పైగా ఉన్న యువతకి 90శాతం దాకా ప్రాతినిధ్యమివ్వాలని, కొత్తతరానికి కొత్త రాజకీయం అందించాలని తపన పడే లోక్‌సత్తాలో భాగస్వామిగా యూత్ పార్లమెంట్ కార్యక్రమాలలో పాల్గొనటం ఎంతో ఆనందాన్నిచ్చింది. ముఖ్యంగా వరంగల్/హన్మకొండ కాకతీయ వర్సిటీలో ఎఫ్‌డీఆర్ (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్), వైబీఐ (యూత్ ఫర్ బెటర్ ఇండియా), లోక్‌సత్తా ఉద్యమ సంస్థ భాగస్వామ్యంతో జరిగిన 'యూత్ పార్లమెంట్ ట ఎడ్యుకేషన్ పాలసీ' గురించి కొంత వివరంగా చెప్పటం.. పాఠశాల నూతన విద్యాసంవత్సర సమయంలో తెలుగు సమాజానికి ఎంతో అవసరమని భావించే ఒక రిపోర్టులాగా నేనిది రాస్తున్నాను. యువత, కళాశాల, పీజీ విద్యార్థులు పాల్గన్నా.. సందర్భానికి తగినట్టు ప్రధానంగా నేను పాఠశాల విద్య మీద స్కూలు పిల్లలు పాల్గన్న చర్చ మీదే ఇందులో ఎక్కువ ప్రస్తావిస్తాను. నా పేరు బండారు రామ్మోహనరావు. లోక్‌సత్తా మలిదశ (లోక్‌సత్తా 2.0) ఉద్యమ తెలుగు రాష్ట్రాల కన్వీనర్‌ని. సాంప్రదాయ రాజకీయాలలో మేం యువకుల కిందే లెక్కయినా, లోక్‌సత్తా రాజకీయం ప్రకారం మేం వయసురీత్యా పెద్దతరమే కాబట్టి.. యువతకు ఈ కార్యక్రమంలో ప్రధానంగా మార్గనిర్దేశనం చేయడానికే నేను, నా సహచరులు పరిమితమయ్యాము.

**బొమ్మరిల్లు సినిమా తల్లిదండ్రులు మారాలి**

**ఈ చదువులు మాకొద్దు - సృజనాత్మక విద్య కావాలి**

నూతన జాతీయ విద్యావిధానంలో పాఠశాల విద్యపై కాకతీయ యూనివర్సిటీ యూత్ పార్లమెంట్‌లో జరిగిన చర్చలో హైస్కూలు విద్యార్థులు కూడా పాల్గన్నారు. "సూర్యోదయం నుంచి అర్థరాత్రి దాకా మరయంత్రాల్లాగా పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్న ఈ చదువులు మాకొద్దు. సృజనాత్మకతతోనే మా'నవ' వికాసానికి పునాదులు పడతాయి" అని ఆర్తితో, ఆవేదనతో మొదలైన అభిప్రాయాలు ఇంతింతైవటుడింతై అన్నట్లు– సమాజ ధిక్కార స్వరాలుగా మారి గర్జించాయి. ఆ చిట్టిబుర్రల్లో ఇంత ఆవేదన, సంఘర్షణ దాగివున్నాయా అని ఆశ్చర్యపోవడం పెద్దలవంతయింది. కాకతీయ వర్సిటీ సెనేట్ హాల్‌లో ఉదయం పదిగంటలకు మొదలైన యూత్ పార్లమెంట్ సాయంత్రం ఐదు గంటలకు ముగియాల్సింది. కానీ రాత్రి ఏడు గంటల దాకా కొనసాగింది. మా పిల్లలు ఉదయమనగా

## ఒక పడవ - ముగ్గురు వ్యక్తుల కథ చెప్పిన చిన్నారి దివ్య (8వ తరగతి)

**ఒ**క పడవలో ముగ్గురు వ్యక్తులు, ప్రయాణిస్తున్నారు. అందులో ఒకరు పడవ నడిపే నిరక్షరాస్యుడు. మిగతా ఇద్దరూ ఆయన్ను అడిగారు– ఏమి చదువుకున్నారు? అని. ఏమీ చదువుకోలేదని, నిరక్షరాస్యుడినని చెప్పారాయన. తాను ఫిజిక్స్ చదివానని ఒకరు తలెగరేశారు. రెండవ వ్యక్తి తాను లెక్కల పండితుడినని, ఎంత కఠినమైన లెక్కనైనా తేల్చిపారేయగలనని చెప్పారు. ఇంతలో పడవకు రంధ్రం పడి నీళ్లు రావటం మొదలైంది. మెల్లమెల్లగా పడవ మునుగుతోంది. అప్పుడు ఆ పడవ నడిపే వ్యక్తి–"మీరిద్దరూ ఇంత చదివారుగా, మరి ఈదడం వచ్చా?" అని అడిగారు. రాదని వారు బిక్కమొగం వేశారు. ఈత వచ్చిన పడవతను ఈదుతూ ఒడ్డుకురాగా, సకల శాస్త్రాలూ చదివినా ఇంగితజ్ఞానం లేకపోవటం వల్ల మిగిలిన ఇద్దరూ మునిగిపోయారు. అలావుంది మన చదువుల పరిస్థితి. ప్రాక్టికల్ నాలెడ్జి లేని చదువులు వద్దు అంటూ ఈ కథను యూత్ పార్లమెంట్‌లో దివ్య వివరించింది.



వెళ్లినవారు ఇంకా రాలేదేమా అని తల్లిదండ్రులు యూనివర్సిటీకి వచ్చి ఆరా తీసే దాకా వెళ్లిందీ సమావేశం. అలా వచ్చిన వచ్చిన తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఇంత ఆవేదన దాగివుందా అని ఆశ్చర్యపోయారు. తాము చేస్తున్న తప్పు ఏమిటో వారికి కూడా అర్థమయింది. పిల్లలను మార్కుల యంత్రాలుగా మార్చివేయడం, ర్యాంకుల కోసం సానబెట్టడం, గ్రేడులు రాకపోతే మందలించడం– చివరికి ఈ చిన్నారి కుసుమాలు వత్తిడి భరించలేక ఆత్మహత్యలతో రాలిపోవడం అంతా కళ్ల ముందు కదలాడింది. తమ తల్లిదండ్రులు తమకు ఏమీ శత్రువులు కారని, తమ మీద ప్రేమతోనే ఈ పని చేస్తున్నారని, తమ భవిష్యత్తు బాగుండాలనే వారు తపన పడుతున్నారని విద్యార్థులు పేర్కొన్నారు. ఎటొచ్చీ తమ అభిరుచులేమిటో, తాము భవిష్యత్తులో ఏ వృత్తులు ఎంచుకోవాలని అనుకుంటున్నారో కనీసం గమనించకుండా, బొమ్మరిల్లు సినిమా తండ్రుల్లాగా ప్రవర్తిస్తున్నారని, తమ అభిమతాలేమిటో తెలుసుకోకుండా తామేం కావాలో తల్లిదండ్రులే నిర్ణయిస్తున్నారని, ఈ వత్తిడి భరించటం భారమవుతోందని చెప్పారు.

### లేత వయసులోనే చిదిమేస్తున్నారు

ఇంటర్మీడియెట్ తర్వాత ఏ కోర్సులో చేరాలో, ఏ చదువులు చదవాలో పసి వయసులోనే తేల్చేస్తున్నారని, లేత వయసులో లేటు వయసు పాఠాలకు పదును పెడుతున్నారని వారు అన్నారు. మూడో తరగతి నుంచే కంప్యూటర్, డిజిటల్ పాఠాల పేరుతో పాఠాలకు పాఠాలు బట్టీపట్టిస్తూ బాల్యాన్ని చిదిమేస్తున్నారని పిల్లలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆరు నుంచి పదవ తరగతి పిల్లలు పదుల సంఖ్యలో వారి మనోవేదనను మాటల తూటాల రూపంలో పేల్చారు. వారి వేదన చూస్తే మానసికంగా వారు ఎంత వ్యధను అనుభవిస్తున్నారో ప్రత్యక్షంగా అర్థమైంది. ఎదురుగా వేదికపైన నాలుగు దశాబ్దాలకుపైగా భారతదేశంలో సంస్కరణలపైనే నిరంతరాయంగా పాలనా, పౌర ఉద్యమ, రాజకీయ రంగాల ద్వారా బహుముఖంగా పనిచేస్తున్న డా॥ లోక్‌సత్తా జయప్రకాష్ నారాయణ్‌తోపాటు జీవితానుభవాన్ని రంగరించుకున్న ప్రొఫెసర్లు, సామాజిక కార్యకర్తలున్నా కూడా పిల్లలు తమ భావాలను స్వేచ్ఛగా, స్పష్టంగా వ్యక్తం చేశారు. మమ్మల్ని పట్టించుకోండి మహాప్రభో అన్నట్టుగా వాళ్లు తమ సమస్య పరిష్కారం కోసం డిమాండ్ చేశారు.

### తల్లిదండ్రులేకాదు టీచర్లూ తక్కువ తినలేదు

పుట్టుకతో అందరూ సమానమే అయినా, పుట్టిన కుటుంబం, కులం, సామాజిక నేపథ్యం, పెరిగిన వాతావరణంతోపాటు జన్యువులు కూడా ప్రభావితం చేస్తాయని, వర్ణ, కుల, ఫ్యూడల్ సమాజాల్లో అందరి అభ్యాసనా ప్రతిభ ఒకేలా వుండకపోవచ్చనే కనీస ఇంగితజ్ఞానం ఎందుకు లేదని



వారు సమాజాన్ని ప్రశ్నించారు. తల్లిదండ్రులే కాదు ఈ విషయంలో టీచర్లు, స్కూలు మేనేజ్‌మెంట్ల పాత్ర కూడా తక్కువ కాదని, ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలల్లో టీచర్లూ తమను మానసికంగా అణగదొక్కుతున్నారని, ఆలోచనాశక్తిని బలహీనపరుస్తూ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నారని పిల్లలు అభిప్రాయపడ్డారు.

**చదువుల్లో 'వీకా'? అయితే సెక్షన్ మార్చండి**

అందరి సామర్థ్యాలూ ఒకేలా వుండవు కనుక, నేర్చుకునే పిల్లలను వారి సామర్థ్యాన్ని బట్టి విభజించి తెలివిగలవాళ్లందరినీ ఒక సెక్షన్‌లో, మధ్యస్థంగా వున్నవారని, బాగా వెనకబడినవారని విడగొట్టి అదే క్లాసులో సెక్షన్లు ఏర్పాటు చేస్తున్నారని, ఇది మానసిక శాస్త్రం ప్రకారం శిక్షార్హమని అన్నారు.

**అందరూ డాక్టర్లూ ఇంజినీర్లే కావాలా?**

మాకు కుటుంబ వ్యవస్థంటే ఇష్టం. కానీ ఇంజినీర్లు, డాక్టర్లే కావాలన్న తల్లిదండ్రుల ఆకాంక్షలు మాకు భయాన్ని కలిగిస్తుంటాయని పిల్లలు అన్నారు. తమకు నచ్చినట్టు చదువుకునే అవకాశం ఉండాలని, ఇందుకు తగ్గట్టుగా పేరెంట్స్, స్కూళ్లు వ్యవహరించాలని కోరారు.

**మ్యాథ్స్ ఇష్టం లేదు, భయం కూడా అంటున్నవారు సగం మంది పైనే**

పాల్గొన్న పిల్లల్లో ఎంతమందికి లెక్కలంటే ఇష్టం లేదు అంటే.. సగానికి పైగా చేతులు పైకి లేచాయి. తమకు అర్థమయ్యేలా చెబుతూ అవకాశాలు వస్తే (ఇస్తే) మేం ఎవరికీ తీసిపోమని తారాజువ్వల్లా ఆకాశం అంచుల దాకా చుట్టివస్తామని పిల్లలు ఆత్మవిశ్వాసంతో చెప్పారు.

చరిత్ర పాఠాలు అవసరంలేదనే వాదన సరైందికాదని, చదువంటే పుస్తకాలే కాదు ఆటలు కూడానని, ఫిజికల్ ఎడ్యుకేషన్‌ను మర్చిపోతే మరుగుజ్జుల్లా తయారవుతామని పిల్లలు చెప్పారు.

**సృజనాత్మకతను చంపకండి**

చివరిగా 'మా సృజనాత్మకతను చంపకండి' అని సభ్యసమాజాన్ని చేతులెత్తి మరీ వేడుకున్నారు – వీళ్లు పిల్లలు కాదు, పిడుగులు!

**చర్చలో విద్యార్థుల అభిప్రాయాలు.. ఒకటి రెండు వాక్యాల్లో..**

• బట్టీ పట్టే చదువులొద్దు. పిల్లల సృజనాత్మకత దెబ్బతింటుంది. మా చిన్నారి మనసులను ఆలోచించనివ్వండి.

– హరిప్రియ, 10వ తరగతి

• చరిత్ర చదవొద్దని, అది వట్టి వేస్టని అంటున్నారు. గతాన్ని మరిస్తే భవిష్యత్తు ఎలా ఉంటుంది?

– ప్రభ, షేన్ హైస్కూల్, వరంగల్

• పిల్లలు కోరుకునే కోర్సునే చెయ్యనివ్వాలి. ఎక్స్‌ట్రాకరిక్యులర్ యాక్టివిటీస్ చేయించి వారి అభిరుచుల్ని గౌరవించాలి.

– వినయ, 8వ తరగతి

• తెలంగాణ బంగారు తెలంగాణగా మారాలంటే పాఠశాల విద్యను బాగు చేయాలి. కేజీ టూ పీజీ విధానాన్ని నాణ్యమైన విద్యతో అందించాలి.

– మనోజ్‌కుమార్

• కళాశాలలకు 'న్యాక్' గుర్తింపు ఉన్నట్టే పాఠశాలలకు ఏదైనా గుర్తింపు ఉండాలి. మార్కులను బట్టి సెక్షన్లను మార్చకూడదు. ఇది విద్యార్థులను కుంగదీస్తుంది.

– సస్య, 10వ తరగతి

• ఆటలు ఆడించే ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు ఆడపిల్లల టాయిలెట్ల వద్ద విజిల్స్ ఊదుతూ ఉన్న ఘటనలు ఉన్నాయి. మహిళల పట్ల సరైన ప్రవర్తనను విద్యావ్యవస్థలో భాగం చేసి కఠినంగా అమలు చేయాలి.

– శ్రియ, 9వ తరగతి

• సీసీఈ అంటే అర్థం మారిపోయింది. సమస్త మూల్యాంకన వ్యవస్థగా కాకుండా కంటిన్యువస్ క్యారీబ్యాగ్ ఎడ్యుకేషన్‌లా మారింది. ఆటల పీరియడ్‌ను మ్యాథ్స్, ఫిజిక్స్ టీచర్లు తీసుకుంటున్నారు. తెలుగు, సోషల్, ఆటలు లేకుండా ఎలా వికసించగలం?

– కొందరు విద్యార్థులు

• సినిమాల ప్రభావం పిల్లలపై బాగా ఉంది. టీవీ, సోషల్ మీడియా నెగెటివ్ ప్రభావాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలి.

– మనోజ్ఞ, 10వ తరగతి

## మీటింగ్‌లోనే పవన్ క్షేత్రస్థాయి ప్రయోగం

ఈ చర్చ జరుగుతుండగానే వరంగల్‌కు చెందిన నవయువకుడు తోట పవన్ లేచి, వేదికనుద్దేశించి చిన్న ప్రయోగం చేస్తా సార్ అని అనుమతి తీసుకున్నాడు. సదస్సుకు హాజరైన హైస్కూలు విద్యార్థినీవిద్యార్థులను ఒకసారి లేచి నించోమన్నాడు. వారు చదువుతోన్న క్లాసులు చెప్పమన్నాడు. పదవ తరగతి చదువుతున్న పిల్లలు కూడా చాలామంది ఐదారుతరగతులు చదువుతున్న పిల్లల్లా శారీరకంగా చాలా బలహీనంగా ఉన్న సంగతిని గమనించమన్నాడు. మానసికంగా, చదువులపరంగా వాళ్లు కొంత బాగానే వున్నా, క్లాసుకు, వయసుకు తగ్గ శరీర సౌష్టవం లేకపోవడం చూపించి– అందరి కరతాళధ్వనులకు పాత్రుడయ్యాడు. పబ్లిగ్గా అలా విద్యార్థులను నిలబడమన్నందుకు మన్నించమని కోరాడు. కామన్‌సెన్స్ ఉంటే మన చుట్టూ ఉన్న అంశాలలో లోపాల్ని ఎలా గుర్తించవచ్చో, వాటిపై ఎలా ప్రజల్లో చైతన్యం తేవచ్చో నిరూపించి పెద్దల మన్నన పొందాడు.

• ఉపాధ్యాయ సంఘాలను నియంత్రించాలి.

– అశోక్ కుమార్, ప్రభుత్వ పాఠశాల హెడ్మాస్టర్

• ప్రభుత్వ బడులలో పర్యవేక్షణ లేదు. ప్రాథమిక స్థాయి విద్యలో పునాదిని గట్టిగా ఏర్పరచాలి.

– లక్ష్మణ్, ప్రైవేటు స్కూలు టీచర్

ఈ చదువులు మాకొద్దంటూ ధ్వజమెత్తిన పిల్లలు.. సృజనాత్మకతకు పదునుపెట్టే చదువులు కావాలని, పిల్లలను యంత్రాలుగా కాకుండా మనుషులుగా గుర్తించమని, పిల్లల మానవ హక్కుల్ని గౌరవించాలని, కేంద్రప్రభుత్వ నూతన జాతీయ విద్యావిధానం రూపకల్పనలో తమ అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని యూత్ పార్లమెంట్ ద్వారా కోరారు.

**.. ఆ గాడిదలకు అర్థం కావటం లేదెందుకు?**

యూత్ పార్లమెంట్‌ను యువ బృందాలు ప్రారంభించి కొందరు విద్యార్థులు మాట్లాడాక.. "చిన్నారులకు ఇంత స్పష్టంగా అర్థమైన విషయాలు దేశాన్ని పాలించే గాడిదలకు అర్థంకావెందుకు?" అని ఆలోచనతో కూడిన ఆవేశాన్ని ప్రదర్శిస్తూ లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చర్చను పదునెక్కించారు. సుమారు ముప్పై మంది పిల్లలు తమ ఆలోచనలను ఆవేశంగానే కాకుండా సామరస్యంగా, పరిష్కారాల దిశగా విశ్లేషించిన తీరు తనలోని ఆశావాదాన్ని మరింత పెంచిందన్నారు. స్వతంత్రం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా ఇప్పటికీ సరైన విద్యావిధానమే లేని దేశంలో, చట్టసభలు ఉన్నా ఊడినా ఒకటేననే పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో.. ఎడ్యుకేషన్ పాలసీపై యూత్ పార్లమెంట్‌ను ఇంత చక్కగా నిర్వహిస్తారని తాను ఊహించలేదన్నారు. "ఈరోజు వరంగల్ సమావేశం నాకెంతో సంతోషాన్ని, తృప్తిని ఇచ్చింది. ఉదయం ఈ చర్చకు వచ్చే ముందు ఇంత అర్థవంతంగా చర్చ జరుగుతుందని




ఊహించలేదు. పిల్లల ఆలోచనా శక్తి, భావప్రకటనా సామర్థ్యం, నిజాయతీతో కూడిన స్వీయానుభవం నుంచి వ్యక్తమైన ధర్మాగ్రహం నను 'ఇన్‌స్పైర్' చేసింది. నేనెంతో అబ్బురపడ్డాను. పిల్లలకు ఏమీ తెలియదనుకుంటున్న పెద్దలదే అజ్ఞానమని చెప్పకతప్పటం లేదు. పెద్దలను గౌరవించే సమాజం మనది. కానీ అది మూర్ఖత్వం కారాదు" అని జేపీ అన్నారు. అక్టోబర్ 2, 2016న యూత్ పార్లమెంట్‌ను ప్రారంభించిన ఉస్మానియాలో కంటే కేయూలో కార్యక్రమం మెరుగ్గా నిర్వహించారంటూ నిర్వాహకుల్ని అభినందించారు. ఈ కార్యక్రమం అందించిన ఆలోచనా ఒరవడిని మున్ముందుకమరింత పదునెక్కించేలా నిర్మాణాత్మకంగా మలచాలని, ఇలాంటి కార్యక్రమాలను తెలుగు రాష్ట్రాలలోను, దేశవ్యాప్తంగానూ పెద్దసంఖ్యలో నిర్వహించాలని అన్నారు.

సమస్యలను ప్రస్తావించడమే కాదు వాటిని ఎలా పరిష్కరించాలో కూడా ఆలోచించాలని జేపీ సూచించారు. "అలా వచ్చిన పరిష్కారాలను క్షేత్రస్థాయిలో అమలుచేయాలి. అన్నీ ఒక రోజులోనో ఒక గంటలోనో పరిష్కారమయ్యేవి కావు. కొన్ని సంస్కరణలు ఏళ్లు పట్టవచ్చు. ఆ దారిలో వున్నామా, లేదా అన్నదే అసలు ప్రశ్న. ఈ సమస్యలకు 'యధాలాప' జనరల్

## విద్యాశాఖ ఇవ్వమంటే అవాక్కయ్యారు : జేపీ

"ఐఏఎస్ అధికారిగా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు.. 'మీరు ఇంత సీనియర్ అధికారి కదా, మీకు నచ్చిన శాఖను ఎన్నుకొమ్మని' అప్పటి రాజకీయ నాయకత్వం, చీఫ్ సెక్రటరీ నాకు అవకాశమిచ్చారు. 1989లో అనుకుంటాను, విద్యాశాఖ ఇవ్వండి అని అడిగాను. 'ఏమిటీ! ఏమాత్రం అధికారం, విలువ, ఆర్థికంగా లాభం లేని శాఖను కోరుకుంటున్నారు?' అని వారు ఆశ్చర్యపోయారు. 'అంత చిన్న శాఖను మీరు కోరినా ఇవ్వం. అంతకంటే మంచి శాఖను కోరుకోండి' అన్నారు. ప్రభుత్వాలకు, రాజకీయ నాయకులకు విద్య అంటే చిన్న శాఖ అనే అభిప్రాయానికి, చులకన భావానికి ఈ సంఘటన నిదర్శనం. కానీ విద్యాశాఖ కంటే దేశాన్ని రాష్ట్రాన్ని బాగు చేసే శాఖ ఏదో నాకు ఇప్పటికీ అర్థం కాదు" అని జేపీ అన్నారు.



పరిష్కారాలు చాలవు. తగినంత కసరత్తు చేయాలి. పిల్లల ఆలోచనలను అణచివేయ కూడదు. మొగ్గలోనే తుంచి వేయకూడదు. వారి అభిప్రాయాలకు విలువనివ్వాలి. మన జీవితానుభవాల్ని (పెద్దల) జతచేయాలి. ఏవరేజ్, ఎక్సలెన్సీలను అనుసంధానం చేయాలి. వాటిని సమతుల్యం చేయాలి. అపుడే నిజమైన పరిష్కారాలు మన మస్తిష్కానికి తడతాయి. అలా వచ్చిన పరిష్కారాలు నాలుగు. వాటిని వివరిస్తాను.

**1. బలం – బలహీనతగా కుటుంబ వ్యవస్థ:** మన సమాజంలో చాలా బలాలున్నాయి. మరికొన్ని బలహీనతలున్నాయి. కుటుంబ వ్యవస్థ భారతీయ సమాజానికి పెద్ద బలం. మా పిల్లలేమయిపోతారోనన్న ఆందోళన వల్ల ముసలివాళ్లయినా ఇంకా తామే పిల్లల్ని నడిపించాలనే ధోరణి మనకున్న బలహీనత. పిల్లలు ఇంజినీర్లు, డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ కాకపోతే, విదేశాలకు వెళ్లకపోతే ఆ తల్లిదండ్రులు పనికిరానివాళ్లనే భావన సమాజం లోనూ కనిపిస్తోంది. న్యాయంగా కాకుండా ఏదోకరకంగా డబ్బు సంపాదించినా ఆ వ్యక్తిని కీర్తిస్తోంది. పుట్టినరోజులు, పెళ్లిళ్లు వంటి వేడుకలకు కోట్లు ఖర్చు చేయటం గొప్పన్నట్టు సమాజం, దాన్నుంచి తల్లిదండ్రులే చెబుతుంటే భావితరాలకు ఎలాంటి సంకేతాన్నిస్తున్నట్టు? పిల్లలు తమకు నచ్చినట్టు ఒక కార్టూనిస్టు గానో, కళాకారుడుగానో, అడ్వకేట్‌గానో, రాజకీయ నేతగానో, సంస్కర్తగానో ఎందుకు కాకూడదు? ఏ పనిచేసినా కష్టపడి 'డిగ్నిటీ ఆఫ్ లేబర్'తో, సొంత ప్రతిభను పెంచుకుంటూ బతికేలా చేయటాన్ని పిల్లల్లో పెంచగలగాలి. కుటుంబ వ్యవస్థ బలాన్ని ఉపయోగించుకుంటూనే నవతరం ఆలోచనలను గౌరవించటమే అసలైన పరిష్కారం.

**2. మోరల్ న్యూట్రాలిటీ:** పుట్టుకతో, కులంతో వచ్చిన అసమానతలు పెద్ద బలహీనత. కానీ ఆ అసమాన సమాజాన్ని నైతికంగా అంగీకరించే మనస్తత్వం అసలైన బలహీనత. ఈ అసమానతలు సమాజంలో సహజమన్న భావనే (మోరల్ న్యూట్రాలిటీ) నిజమైన బలహీనత. కుల మనస్తత్వం–'సైకాలజీ ఆఫ్ క్యాస్ట్' మనల్ని డామినేట్ చేస్తోంది. మనం ఎంత అభ్యుదయ భావాలున్నవారమైనా పుట్టుకతో మనకు వచ్చే కుల భావన వెంటాడుతుంది. అందరి కంటే మనమే ఉన్నతులమని అది

మనల్ని వెనకనుండి నెడుతుంటుంది. బయట సమాజంలో మనం ఎంత ఉన్నతులమైనా, మన ఇంట్లో కూడా అది మనల్ని వెంటాడుతుంది. పనిమనిషి, ప్లంబర్, కూలీ, తాపీ మేస్త్రి, ఎలక్ట్రీషియన్ తక్కువ అనే భావన, ఫలానా కులం వారు తక్కువ అనే భావన నరనరాల్లో జీర్ణించుకుపోయిన సమాజం మనది. దాన్ని అధిగమించాలి. పుట్టుక వల్ల మన అసమానతలు చాలా సహజమన్న భావన కలిగిన సమాజం ఎదగదు. ఒక సభలో రిజర్వేషన్లు అవసరమా?.. అన్న భావనకు ఎక్కువ చప్పట్లు పడ్డాయంటే ఎదురుగా వున్నవారు ఏ కులాలకు చెందినవారో చెప్పొచ్చు. అగ్రకులాలు అని పిలిపించుకునే ఆ కులాల్లో కూడా పేదలున్నారు. ఆ పేదలు కూడా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా బల్లలు చరుస్తారు. దీన్నే సైకాలజీ ఆఫ్ క్యాస్ట్ అంటారు. అసమానతలు పుట్టుకతో వచ్చే సమాజంలో వాటిని సమతుల్యం చేసి అణగారిన వర్గాలను సమానత్వం వైపు తెచ్చే పరిష్కారం కోసం పోరాడాలి.



**3. నిద్రపట్టని రాత్రులు గడిపే నాయకత్వం కావాలి:** ఏ విషయం పట్లయినా లోతుగా ఆలోచించకుండా నిర్ణయాలు తీసుకునే సమాజంనుంచి సరైన పరిష్కారాలు రావు. యధాలాపంగా, యాంత్రికంగా ఆలోచిస్తున్నాం మనం, మన సమాజం. "దేశంలో, సమాజంలో నిజమైన మార్పును తేగలిగే పిల్లల చదువుల విషయంలో మనం ఎలా వున్నాం" అని ఆలోచించే రాజకీయ నాయకులు, అధికార యంత్రాంగం రావాలి, కావాలి! సమాజం గురించి, సమాజ రుగ్మతల గురించి అర్థరాత్రి మెలకువ వచ్చి ఆలోచించే తపన ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రులకు కావాలి!! మామూలుగా అయితే సీఎం, పీఎంలు నిద్ర మానుకుని మరీ ఆలోచించనక్కర్లేదుగానీ, మనదేశంలో కీలక రంగాల్లో తరతరాల వైఫల్యం వారికి నిద్రపట్టనీయకూడదు. చిన్ని నా బజ్జకు శ్రీరామరక్ష అనుకోకుండా.. సమాజ సమస్యలకు ఉలిక్కిపడి నిద్రలేచి ఆలోచించాల్సిన పరిస్థితిని కల్పించాలి. నిద్రలేని రాత్రులు గడిపి ఉదయాన్నే మంచి పరిష్కారాలు చూపించే నైతిక నాయకత్వం దేశానికి అవసరం.

**4. పెత్తందారీ ఫ్యూడల్ ఆలోచనాధోరణి పోవాలి:** దేశంలో పొరపాటున ఈ పిల్లలందరూ మంచి, నాణ్యమైన చదువును చదివి తెలివిగా ఆలోచిస్తే ఎలా.. అనే దుర్మార్గపు ఫ్యూడల్ భావజాలం పోవాలి. రాజకీయ నాయకుల్లో, అధికారుల్లోనూ ఇది ఉంది. గతంలో గ్రామాల్లో రోడ్లు, సౌకర్యాలు, పాఠశాలలు వద్దనేవారు. అలా రవాణా లేని కమ్యూనికేషన్లు లేని సమాజంతోపాటు విద్యలేని సమాజం కూడా కావాలని, ఆలోచన లేని సమాజం కూడా కావాలని పాలకులు భావించే ప్రపంచంలో ఉన్నాం మనం.

పై నాలుగింటిలో ఏది ఎంత వరకు కరెక్టో నాకు తెలియదు. మనుషులుగా మనకు జీవితం ఉంది. అది ఒక్కటే. ఎవరు ఎప్పుడు చనిపోతామో తెలియదు. అందరం ఎప్పుడో ఒకప్పుడు పోవలసినవారమే. మరణం మంచి సోషలిస్టు.

సుసంపన్నమైన, ఆహ్లాదకరమైన, ద్వేషరహిత సమాజాన్ని కాంక్షించాలి. ఆనందాన్ని నింపే సమాజాన్ని, అందరి ప్రతిభ వికసించే సమాజాన్ని ఆకాంక్షించాలి. ఆ లక్ష్యం కోసమే ఇదంతా చెప్పటం. ఇంతకంటే ఈ సాయంత్రం నేను చెప్పేదేమీ లేదు" అని ఆర్రత నిండిన హృదయంతో జేపీ అన్నారు. హాలంతా కొద్దిసేపు నిశ్శబ్దం.. ఆ తర్వాత చప్పట్లు.

- విద్యార్థులు నిర్వహించిన యూత్ పార్లమెంట్‌ను చూసి నిజమైన పార్లమెంట్, అసెంబ్లీ సభ్యులు సిగ్గు తెచ్చుకోవాలి.
- కనీస తార్కికత (లాజిక్) లేకపోతే.. గాలిలో దీపం పెట్టి దేవుడా! నీవే దిక్కు అన్నట్టు ఉంటుంది.
- పరిజ్ఞానం, లోకజ్ఞానం, పౌరసత్వం ప్రాతిపదికగా విలువలతో కూడిన విద్యను అందించాలి.
- వివిధ సామాజిక నేపథ్యాలున్న వర్గ సమాజం మనది. దాన్ని అర్థం చేసుకోవాలి. నిర్మాణాత్మక సృజనాత్మకతతో మంచి ఆర్థిక, రాజకీయ, పాలనా, సామాజిక పరిష్కారాలు సాధించాలి" అని జేపీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ■

# రామాయపట్నాన్ని రాకుండా చేయటం వల్ల..




ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో సంక్షుభిత పరిస్థితుల మధ్య కూడా 'వన్ మ్యాన్ విత్ కన్విక్షన్ ఈజ్ ఎ మెజారిటీ'లా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రదర్శించిన పనితీరు గురించి ప్రత్యేకించి వివరించనక్కర్లేదు. సభలో జేపీ లేవనెత్తిన అంశాల్లో వాన్‌పిక్ కుంభకోణం ఒకటి.

వాన్‌పిక్ సహా ప్రైవేటు ఓడరేవుల పేరుతో 348 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని మరొకరు అడుగుపెట్టటానికి వీల్లేకుండా ఒకే గ్రూప్‌నకు ధారాదత్తం చేస్తూ వైఎస్సార్ హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని 2010-11లో సభలో లేవనెత్తి.. అందులోని భారీ అవినీతి, అక్రమాలను జేపీ ఎండగట్టారు. ఈ భారీ కుంభకోణం బైటపడటానికి వెనక అసలు కారణం, ఏదో తీగలాగితే డొంక కదిలినట్టు బైటపడింది.




విశాఖలో నేవల్ బేస్ విస్తరణ కోసం కొంత తీరప్రాంతాన్ని కేటాయించినందుకు పరిహారంగా రక్షణశాఖ రూ.1000కోట్లు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చింది. ఆ డబ్బుతో దక్షిణాదిన ఒక పోర్టు, షిప్‌యార్డు నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. అయితే దక్షిణాదిన ఉన్న తీరప్రాంతాన్ని శాశ్వత ప్రాతిపదికన ఆ కృష్ణపట్నం, మచిలీపట్నం, వాన్‌పిక్ పోర్టులకు ఇచ్చివేసినందున కొత్త పోర్టుకు, షిప్‌యార్డుకు అవసరమైన స్థలాన్ని కేటాయించలేమని, కావాలంటే విశాఖ పక్కనున్న నక్కపల్లిలో తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది. తుని నుంచి తడ దాకా.. వందల కిలోమీటర్ల తీరప్రాంతంలో ప్రభుత్వానికి కూడా ఒక్క ఎకరం భూమి కూడా దొరకని పరిస్థితి చూశాక ఆంధ్రప్రదేశ్‌లో ఎంతటి దారుణమైన దోపిడీ జరుగుతోందో సాక్ష్యాధారాలతో బైటపడింది.

ఈ వివరాలన్నిటినీ మీడియాలో, రాష్ట్రంలోని వివిధ సభలలో, అసెంబ్లీలో జేపీ సవివరంగా తెలియచేస్తూ.. ఏపీలో మరో పోర్టు నిర్మాణానికి స్థలాన్ని ఎంపిక చేయటానికి కేంద్రం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత కేంద్రం ఒక కమిటీని నియమించింది. రామాయపట్నం ప్రాంతాన్ని పోర్టు ఏర్పాటుకు అనువైనదిగా కమిటీ నిర్ణయించింది. కానీ అక్కడున్న కొందరు ఎంపీలు, రాజకీయ నేతలు స్వార్థప్రయోజనాల కోసం రామాయపట్నానికి గండి కొట్టేలా దుగ్గరాజపట్నం పేరును ప్రతిపాదించారు. 'దుగ్గరాజపట్నానికి కూడా పోర్టు వస్తే సంతోషమే. కానీ పక్కనే కృష్ణపట్నం ఉండగా, దుగ్గరాజపట్నం అంతగా లాభసాటిగా ఉండదు కాబట్టి, ముందుగా రామాయపట్నంలో ఏర్పాటు చేసేందుకు తెలుగువారంతా సమష్టిగా కృషి చేయాలని' జేపీ విజ్ఞప్తి చేశారు. అయినా పట్టించుకోకుండా అడ్డం కొట్టారు. ఆ తర్వాత విభజన చట్టంలో కూడా దుగ్గరాజపట్నం పేరు చేర్చారు. చివరికి దుగ్గరాజపట్నంలో పోర్టు నిర్మాణం ఆర్థికంగా కలిసిరాదని, కేంద్ర ప్రభుత్వానికి భారం పెరగటమే తప్ప ఆదాయం రాదని నౌకాయాన శాఖ 2017లో పార్లమెంటులో స్పష్టం చేసింది. రైట్స్, ఇ అండ్ వై, ఏకోమ్ తదితర సంస్థల అధ్యయనం తర్వాత కేంద్రం ఈ నిర్ణయానికి వచ్చింది. ప్రాజెక్టుకు అవసరమయ్యే భూమి, మౌలిక సదుపాయాలు, పునరావాస ప్యాకేజీని భరిస్తామన్న రాష్ట్ర ప్రభుత్వం కూడా అలసత్వంతో వ్యవహరిస్తుండటంతో.. ఇక దుగ్గరాజపట్నం పోర్టు ప్రతిపాదనను నిలిపివేసినట్టే. దీనికి బదులు, రూ.5,500 కోట్ల విలువైన మరో నౌకాశ్రయాన్నిగానీ, ఇతర ప్రాజెక్టునుగానీ ఎంచుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సూచించాలని నీతి ఆయోగ్ వర్గాలు కేంద్రానికి సిఫార్సు చేశాయి. సొంత ప్రయోజనాలకు పోకుండా ప్రజా ప్రయోజనాల దృష్టితో ఆలోచించి రామాయపట్నం భారీ పోర్టును వేగంగా సాధించుకునేందుకు అందరూ కలసిమెలసి పనిచేసి ఉంటే.. రాష్ట్ర విభజనకు ముందే సాకారమై ఉండేది. విభజన సమయంలో మరో ప్రాజెక్టు కూడా వచ్చి ఉండేది. రాష్ట్ర విభజన అనివార్యమని తెలిసినా, మిగిలిన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఏం కావాలో అడగకుండా సమైక్యాంధ్ర ఉద్యమాలు చేయించిన నేతలు ఇలా అన్ని రకాలుగా ప్రజల్ని వంచించారు. ■

# ఆర్‌టీఏస్ చట్టాన్ని వెంటనే తెండి - సీఎంకి పెద్దసంఖ్యలో కార్డులు



తెలంగాణ ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలు, వేధింపులు లేకుండా సేవలందేలా చేసే 'పౌరసేవల' (రైట్ టూ సర్వీసెస్/సర్వీస్ గ్యారంటీ-ఆర్‌టీఏస్) చట్టాన్ని వెంటనే అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించాలని తెరాస ప్రభుత్వాన్ని లోక్‌సత్తా డిమాండ్ చేసింది. దీనికోసం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకి పోస్టుకార్డులు రాసే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడుతున్నట్టు లోక్‌సత్తా ఉద్యమసంస్థ తెలుగు రాష్ట్రాల కన్వీనర్ బండారు రామ్మోహనరావు తెలిపారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు డా॥ పాండురంగారావుతో కలిసి పోస్టుకార్డుల ప్రచారం నిర్వహించారు. "ఓటు మనది. పనులు మనవి. పోగొట్టుకున్న సార్వభౌమాధికారాన్ని తిరిగి సాధించుకుందాం. ప్రభువులమవుదాం. అవినీతి లేని సేవల కోసం పౌరసేవల చట్టాన్ని తెచ్చుకుందాం'' అని పాండురంగారావు పిలుపునిచ్చారు. ఈ అంశంపై ప్రజల్లో చైతన్యానికి పలు కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని, లోక్‌సత్తా రూపొందించిన పౌరసేవల బిల్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద ఉందని, దీనిపై వెంటనే స్పందించి చట్టం చేయాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ప్రతి ఆఫీసులో సిటిజన్ ఛార్టర్లు పెట్టి, చెప్పిన గడువులోగా పని చేయలేకపోతే రోజుకు కనీసం రూ.250 పరిహారంగా ప్రజలకు చెల్లించాలన్నారు. పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ కూడా ఈ చట్టాన్ని తీసుకువచ్చేలా లోక్‌సత్తా కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ నేతలు అల్లేని నిఖిల్, నందూరి సరోజాదేవి, నందిపేట రవీందర్, రాందేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు. ■

# లంచాలివ్వొద్దు... పౌర సేవల చట్టంపై అవగాహన పెంచుకోండి



ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులని.. పాలకులు, ప్రభుత్వోద్యోగులు సేవకులు మాత్రమేనని డా॥ పాండురంగారావు అన్నారు. అందుకే, ప్రభుత్వ కార్యాలయాల్లో పౌర సేవల్ని డిమాండ్ చేసే హక్కు తమకుందని ప్రజలంతా గుర్తించాలన్నారు. అవమానాలు, లంచాలు, బెదిరింపులు లేకుండా ప్రజలకు ఒక హక్కులాగా సేవలను అందించేందుకే లోక్‌సత్తా 'పౌర సేవల' చట్టం కోసం పోరాడుతోందన్నారు. ఈ బిల్లు గురించి అవగాహన చేసుకుని, చట్టంగా మార్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, దీనివల్ల మన జీవితాల్లో చాలా పెద్ద మార్పు వస్తుందని అన్నారు. రోజువారీ సేవల్లో 80శాతం వరకూ వేగంగా పూర్తవుతాయన్నారు. పౌర సేవల చట్టంపై లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని వారాలుగా ఇలాంటి సమావేశాలను తెలంగాణలో నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు తమ వంతు ప్రయత్నం చేశామని, ఇప్పుడు ముగింపు సమావేశం అనంతరం చట్టం చేయాలని ఎమ్మెల్యేలు, ప్రభుత్వాన్ని మరింత గట్టిగా డిమాండ్ చేస్తామని తెలిపారు. ప్రజలెవ్వరూ ప్రభుత్వ కార్యాలయాల్లో లంచాలివ్వొద్దన్నారు. ప్రభుత్వ సాయంతో నడిచే ప్రైవేటు స్వచ్ఛంద సంస్థలను కూడా ఈ చట్టం పరిధిలోకి తేవాలని, ప్రజాప్రతినిధులపై వచ్చే ఆరోపణలను పరిష్కరించేందుకు గ్రామస్థాయి నుంచి కేంద్రం వరకు ట్రిబ్యునళ్లను ఏర్పాటు చేయాలని సమావేశానికి హాజరైన ప్రతినిధులు అభిప్రాయపడ్డారు. పౌర సేవల చట్టం కోసం 1998 నుంచి లోక్‌సత్తా కృషి చేస్తోందని, ఈ చట్టం (ఆర్‌టీఏస్) సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కంటే కూడా శక్తిమంతమైనదని బండారు రామ్మోహనరావు అన్నారు. జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నిఖిల్, సరోజాదేవి, అధికార ప్రతినిధి నందిపేట రవీందర్, రాందేశ్‌పాండే, జయంత్, శ్రీరాములు తదితర నేతలు పాల్గొన్నారు. ■

# విభజన హామీలన్నిటినీ నెరవేర్చాల్సిందే



కేంద్రం పట్ల మెతక వైఖరితో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు వల్లే ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సక్రమంగా అమలుకాలేదని లోక్‌సత్తా పార్టీ ఏపీ అధికార ప్రతినిధి కూసంపూడి శ్రీనివాస్ అన్నారు. విభజన చట్టంలోని హామీల అమలుకు తమ వంతు ప్రయత్నం చేశామని, అయినా చంద్రబాబు ప్రభుత్వం చొరవ తీసుకోవటంలో విఫలమవుతోందన్నారు. 'జూన్ 1 తర్వాత ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 108'పై హైదరాబాద్‌లో ఏపీ ప్రత్యేక హోదా సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో కూసంపూడి మాట్లాడారు. చట్టంలో ఉన్న 108 సెక్షన్‌లోని అంశాలను పరిష్కరించేలా కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు చంద్రబాబు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని సమావేశంలో పలు రాజకీయ పార్టీలు, సంఘాలు డిమాండ్ చేశారు. విభజన హామీలన్నిటినీ సంపూర్ణంగా అమలు చేయించుకోవటం కోసం గవర్నర్ నరసింహన్, ముఖ్యమంత్రి చంద్రబాబులను కలవాలని సమావేశం నిర్ణయించింది. రాష్ట్ర విభజన జరిగి మూడేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ఉద్యోగాలు, నదీజలాలు వంటి సాధారణ పాలనాంశాలు కూడా పరిష్కారం కాలేదని, ఇంకా జాప్యం వల్ల రాష్ట్రం నష్టపోతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. 108లోని అంశాలను అమలుచేయనట్టయితే రాష్ట్రానికి శాశ్వత నష్టం జరుగుతుందని సమావేశానికి నేతృత్వం వహించిన హోదా సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ అన్నారు. ఏపీసీసీ ఉపాధ్యక్షుడు టి.తులసీరెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే బి.రాజేంద్రనాథ్‌రెడ్డి, మనరాజ్యం ప్రతినిధి కటారి శ్రీనివాసరావు, సీనియర్ సంపాదకుడు తెలకపల్లి రవి, సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావు, విద్యార్థి జేఏసీ నాయకుడు సురేష్, వీసీసీ అధికార ప్రతినిధి సూర్యనారాయణరెడ్డి, ప్రొఫెసర్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. ■

# దిష్టిబొమ్మల్లా సర్పంచ్‌లు .. మురికికూపాల్లా మునిసిపాలిటీలు,

## జిల్లాలో ప్రజా సమస్యలపై ఉద్యమం రావాలి: లోక్‌సత్తా రౌండ్‌టేబుల్‌లో నేతలు



ఉత్తరాంధ్రకిచ్చిన హామీల అమలులో చంద్రబాబు ప్రభుత్వ దగాపై జిల్లాలు, నియోజకవర్గాలవారీగా లోక్‌సత్తా పార్టీ రౌండ్‌టేబుల్ సమావేశాలను ప్రారంభించింది. విజయనగరంలో జరిగిన సమావేశంలో వక్తలు సర్కారు తీరుపై, స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల చంచాగిరిపై మండిపడ్డారు. పదవుల కోసం వెంపర్లాడటం తప్ప స్థానిక ప్రజాప్రతినిధులు జిల్లా సమస్యలను పట్టించుకోవటం లేదని సమావేశానికి నేతృత్వం వహించిన లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అల్లంశెట్టి నాగభూషణం అన్నారు. నిధుల పంపిణీ లేక, పాలన సక్రమంగా లేక పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని, సర్పంచ్‌లు దిష్టిబమ్మల్లా తయారయ్యారని అన్నారు. అన్ని పనులకూ తమనే సంప్రదించాలనే ఎమ్మెల్యేలు తప్పించుకుతిరుగుతున్నారన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ, మునిసిపాలిటీల్లో ఎప్పుడూ చూడనంత అధ్వాన్న పాలన జరుగుతోందన్నారు. పారిశుద్ధ్యంలేక జబ్బులు పెరుగుతున్నాయని, కాలుష్యం దీర్ఘకాల వ్యాధులకు దారితీస్తోందని అన్నారు. ఎన్ని వినతిపత్రాలు అందించినా స్పందించలేని పక్షవాతం మునిసిపల్ పాలకసంఘాన్ని ఆవరించిందని బీసీ సంఘాల వేదిక నాయకుడు రామేశ్వరపు రామారావు అన్నారు. ఒక్కటంటే ఒక్క హామీని అమలుచేయకపోవటం సిగ్గుచేటన్నారు. ప్రచార గ్రాఫిక్కులు తప్ప చంద్రబాబు పాలనలో వాస్తవంగా జరుగుతున్న అభివృద్ధి శూన్యమని, రైల్వే జోన్ విషయంలో, ప్రత్యేకహోదా విషయంలో, అసెంబ్లీలో ప్రకటించిన హామీల విషయంలో మోసపూరితంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందని మహిళాసత్తా జిల్లా అధ్యక్షురాలు ఇనగంటి అనంతలక్ష్మి అన్నారు. లోక్‌సత్తాకి కుడి, ఎడమ, ఎరుపు, కాషాయం తేడా లేదని.. సమస్యల పరిష్కారంపై లోక్‌సత్తా పార్టీతో కలసి అన్ని ప్రజాసంఘాలూ కలసి పనిచేయాలని సూచించారు. దళిత సంఘాల ప్రతినిధులు ఆదాడ మోహనరావు, పౌరవేదిక జిల్లా కార్యదర్శి గిడితూరి పైడితల్లి, పాండ్రంకి వెంకటరమణ, బోర రమేష్, దప్పు శ్రీను, పతి వాడ చంద్రా రావు , బూడి సన్యాసి నాయుడు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు. ■

# ప్రాంతీయ మండళ్లు + : ఉత్తరాంధ్ర అభివృద్ధికి జేపీ రోడ్‌మ్యాప్



పుష్కల వనరులు, అపార సాంస్కృతిక వారసత్వమున్నా కేంద్రీకృత పాలన, నేతల నిర్లక్ష్యం వల్లే ఉత్తరాంధ్ర ప్రాంతం వెనకబడిందని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. పాలన ప్రజలకు ఎంత దగ్గరగా ఉంటే అంత అభివృద్ధి చెందుతారని.. రాష్ట్ర పాలనను, అభివృద్ధిని వికేంద్రీకరిస్తేనే ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ఉద్ఘాటించారు. ఉత్తరాంధ్ర సహా ఏపీలో నాలుగు ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేయాలన్నారు.

***'ఉత్తరాంధ్ర వెనకబాటుతనం – ప్రజల ఆకాంక్షలు'పై విశాఖపట్నంలో జరిగిన సదస్సులో జేపీ ముఖ్యఅతిథిగా పాల్గన్నారు. ఉత్తరాంధ్ర చర్చా వేదిక ఆధ్వర్యంలో పార్లమెంటు మాజీ సభ్యుడు, మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం కార్యదర్శి పి.మధు, మాజీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.వి రమణ, రిటైర్డ్ ఇంజినీర్ ఎన్.సత్యనారాయణ తదితరులు కూడా ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.***



1000 మిల్లీమీటర్ల వర్షపాతం, నదులు, కోస్తాతీరం ఉత్తరాంధ్రకు ప్రకృతి ఇచ్చిన సామర్థ్యాలని జేపీ అన్నారు. రూ. 1,56,000కోట్లతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏటా ఒక్కో పౌరుని మీదా సుమారు రూ. 31,000 ఖర్చు చేస్తోందని, ఉత్తరాంధ్ర, మరో మూడు ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేసి బడ్జెట్‌లో ఆరవ వంతును నేరుగా కేటాయించాలన్నారు. 'ఉత్తరాంధ్ర, రాయలసీమ, తూర్పు గోదావరి+పశ్చిమ గోదావరి+కృష్ణా జిల్లాలు, దక్షిణ కోస్తా' ప్రాంతీయ మండళ్లను ఏర్పాటు చేయాలన్నారు. వీటికి నేరుగా ఆరవ వంతు బడ్జెట్‌ను కేటాయిస్తే తలసరి రూ. 5,000 వస్తుందని, ముఖ్యమంత్రి, రాజధాని అధికారుల చుట్టూ తిరగకుండా స్థానికంగా ప్రాజెక్టులను, అవసరాలను వేగంగా సాధించుకునే అవకాశం ప్రజలకు లభిస్తుందని అన్నారు. ఇందులో ఒక్కో పౌరుని పేరు మీదా రూ. 1000 నేరుగా గ్రామపంచాయతీలకు, మునిసిపల్ వార్డులకు వెళ్తుందన్నారు. ఈ ప్రాంతీయమండళ్లలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీలు, మునిసిపల్ ప్రజాప్రతినిధులు సభ్యులుగా ఉండి ప్రాజెక్టుల రూపకల్పన, అమలు చేస్తుంటారన్నారు. మిగతా ఐదొంతుల బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే ఖర్చు చేస్తుందని, ప్రాంతీయ మండళ్ల పనుల్లో ఏదైనా అవినీతి, అవకతవక జరిగితే కఠిన చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటుందన్నారు. ఏపీ విస్తీర్ణంలో 15శాతం ఉన్న ఉత్తరాంధ్రలో 19శాతం రాష్ట్ర జనాభా నివసిస్తున్నారని, ఈ రకమైన వికేంద్రీకరణ నమూనాయే ఉత్తరాంధ్ర సమగ్రాభివృద్ధికి సరైన పరిష్కారమని స్పష్టంచేశారు. ఇటువంటి సంస్థాగత మార్పులు, దీర్ఘకాలిక కృషి లేకుండా ఒట్టి తీర్మానాలతో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధ్యం కాదని, ఈ నమూనా అమలు కోసం పార్టీలకతీతంగా అందరూ కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు.

ఆరున్నర కోట్ల జనాభా ఉన్న బ్రిటన్‌లో స్కాట్లాండ్, వేల్స్, ఉత్తర ఐర్లాండ్‌కు ప్రాంతీయ పార్లమెంటులున్నాయని, ప్రజలకు దూరంగా రాజధానుల్లో అధికారముంటే అవినీతి, ఆలస్యం, ప్రజల్లో తిరస్కార భావం పెరుగుతాయని అన్నారు. పేదరికం, వెనకబాటుతనం ఉన్న ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం లోక్‌సత్తా తొలినుంచీ పోరాడుతోందని, రాయలసీమతోపాటు ఉత్తరాంధ్రకు మేలు జరగాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర విభజన సమయంలో మొట్టమొదటిసారిగా ప్రత్యేక తరగతి హోదా ప్రతిపాదనను తానే అసెంబ్లీలో చేశానని జేపీ అన్నారు. రాజధాని అమరావతిని మాత్రమేకాకుండా ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు కూడా అభివృద్ధిని పంచాలని తొలి నుంచీ గట్టిగా మాట్లాడింది లోక్‌సత్తాయేనన్నారు. ఉత్తరాంధ్రలో విశాఖ నగరాన్ని మినహాయిస్తే, శిశుమరణాలు వెయ్యికి 55, అక్షరాస్యత

60శాతం, మహిళా అక్షరాస్యత 50.7శాతం, మంచినీటి సౌకర్యం లేని ఇళ్లు 86శాతం, మరుగుదొడ్లు లేని ఇళ్లు 79శాతం, తలసరి ఆదాయం 38,000 ఉందన్నారు. ప్రత్యేక హోదా గల పలు ఈశాన్య రాష్ట్రాలు, జమ్మూకాశ్మీర్ కంటే ఉత్తరాంధ్ర వెనకబడి ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. మనదేశానికి స్వతంత్రం వచ్చి ప్రజాస్వామ్యం వచ్చినా నాయకులు ఇంకా రాచరిక, భూస్వామ్య పెత్తన ధోరణుల్ని విడిచిపెట్టలేదని, అందుకే ప్రజాప్రయోజనాలకు బదులు సొంత కుటుంబ ప్రయోజనాలను చూసుకుంటున్నారన్నారు. అందువల్లే.. తమ పిల్లలులాగే ప్రతి బిడ్డా ఎదిగేందుకు కావలసిన మంచి చదువు, ఆరోగ్యం అందించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ఏపీ ప్రభుత్వ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి మీద ఏటా రూ.48,000 ఖర్చు చేస్తున్నా ఆ చదువు పనికిరావటం లేదన్నారు. విద్యాహక్కు చట్టాన్ని ప్రక్షాళన చేసి పేద, మధ్యతరగతి పిల్లలకు కూడా మంచి చదువును అందించాలని డిమాండ్ చేశారు. తాండవ-గోస్తనీ-నాగావళి-వంశధార తదితర నదులను అనుసంధానించాలన్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తిచేయటం, పోలవరం ఎడమ కాలువను శ్రీకాకుళం వరకు పొడిగించటం, మహానది-గోదావరి జలాలను అనుసంధానించటం వేగంగా జరగాలని.. ఇదేమీ అసాధ్యం కాదని, ఏటా రూ.4,000 కోట్లు మూడునాలుగేళ్లపాటు కేటాయిస్తే చాలని అన్నారు. బడ్జెట్ నిధులను తాత్కాలిక తాయిలాలకు బదులు రాష్ట్ర జనాభాలో 19శాతం ఉన్న ఉత్తరాంధ్ర ప్రజలకు తరతరాలపాటు మేలు చేసే పనులకు ఉపయోగించాలన్నారు. అలాగే నూతన ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సాక్షిగా ఉత్తరాంధ్రకు ప్రభుత్వం ఇచ్చిన 35 హామీల్ని (శ్రీకాకుళం జిల్లాకి 12, విజయనగరానికి 10, విశాఖపట్నానికి 13) నిర్ణీత కాలవ్యవధిలో నెరవేర్చాలన్నారు. ఈ ప్రాంతంలో భూకబ్జాలు పెరిగి పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటిష్‌వారి హయాంలో 30 ఏళ్లకోసారి భూసర్వే చేసేవారని, స్వతంత్రం వచ్చాక ఇప్పటిదాకా ఆ ప్రయత్నం లేదని అన్నారు. భూసర్వేలు చేపట్టి కంప్యూటరీకరించటంతోపాటు యజమానికి టైటిల్ ఇవ్వాలని జేపీ అన్నారు.

కొణతాల మాట్లాడుతూ, ఉత్తరాంధ్ర అత్యంత దయనీయ స్థితిలో ఉందని, 30లక్షల ఎకరాలుంటే 8 లక్షలకే సాగునీరు అందుతోందని అన్నారు. విశాఖలో సమ్మిట్లు జరుగుతున్నా ఉద్యోగాలు రావటం లేదన్నారు. ఉత్తరాంధ్రకి బడ్జెట్‌లో రూ.30,000 కోట్లు కేటాయించాలన్నారు. రాజకీయాల కతీతంగా మూడు జిల్లాల్లో సదస్సుల అనంతరం ఆగస్టులో ఉత్తరాంధ్ర డిక్లరేషన్‌ని ప్రకటిస్తామన్నారు.



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్ చుట్టూనే అంతా కేంద్రీకరించి తాము తప్పుచేశామని రఘువీరారెడ్డి అన్నారు. ఇప్పుడు కూడా అమరావతి చుట్టూనే కాకుండా ఉత్తరాంధ్రకు కేటాయింపులు జరపాలన్నారు. రాష్ట్రపతి ఎన్నికలలో ఓటు వేయాలంటే ప్రత్యేకహోదా ఇవ్వాల్సిందేనని టీడీపీ, వైకాపా పట్టుబట్టాలని, వెనకబడిన ఏడు జిల్లాలకు రూ.25,000కోట్లు కావాల్సి ఉండగా, రూ.1050కోట్లు ముష్టిలా విదిల్చారన్నారు. ఉత్తరాంధ్ర వెనకబాటుతనం గురించి శ్రీకృష్ణ కమిటీ కూడా చెప్పిందని, పోరాటం ద్వారా ఉత్తరాంధ్ర హక్కులను సాధించుకోగలమని సీపీఐ నేత రామకృష్ణ అన్నారు. పాఠశాలల మూసివేత, ఉద్దానం కిడ్నీ బాధితుల సమస్యల్ని ప్రస్తావిస్తూ ఉత్తరాంధ్ర పట్ల పాలకుల తీరుని మధు ఎండగట్టారు. సామాజిక బాధ్యతలేని రియల్ ఎస్టేట్ ప్రభుత్వాలు పాలిస్తున్నాయని ప్రొఫెసర్ కేఎస్ చలం అన్నారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల తీరుతెన్నుల గురించి సత్యనారాయణ వివరించారు. ప్రజల అమాయకత్వం, స్థానిక నాయకత్వం లేకపోవటం వల్ల ఉత్తరాంధ్ర దోపిడీకి గురవుతోందని, పెద్ద చదువులు చదువుతున్నా యువతకు ఉద్యోగాలు రావటం లేదని ఆచార్య కె.వి రమణ అన్నారు. ఉత్తరాంధ్ర దారుణ వివక్షకు గురైందని, అభివృద్ధికి ప్రత్యేకహోదా రావాల్సిందేనని జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. సమయాభావం వల్ల రాలేకపోతున్నానని చెబుతూ ఆయన పంపిన లేఖను ఆ పార్టీ ప్రతినిధి దుర్గాప్రసాద్ చదివి వినిపించారు.

ఉత్తరాంధ్ర వలసలు, వెనకబాటుతనంపై తొలుత వంగపండు ప్రసాదరావు, రాజు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. సదస్సులో మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, ద్రోణంరాజు శ్రీనివాస్, పిన్నింటి వరలక్ష్మి, సి.ఎస్ రావు, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, నేతలు ఎంఎస్ఎన్ మూర్తి, వేణుగోపాల్, హరిగణేష్, వివిధ పార్టీల, ప్రజాసంఘాల ప్రతినిధులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ■

# ధర్నాచౌక్‌పై సర్కారు తీరును గర్హించిన లోక్‌సత్తా





ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు తెలిపేందుకు ఉద్దేశించిన ధర్నాచౌక్‌ను ఇందిరాపార్కు వద్ద నుంచి తొలగించాలనే నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని లోక్‌సత్తా పార్టీ డిమాండ్ చేసింది. ప్రభుత్వ విధానాల్లో, అధికార పార్టీ రాజకీయంలో సత్తా ఉంటే.. ధర్నా చౌక్‌ల వద్ద ఆందోళనల గురించి భయపడాల్సిన అవసరం ఉండదని పార్టీ నేతలు అన్నారు. 'ధర్నాచౌక్ పరిరక్షణ సమితి' ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద జరుగుతున్న వివిధ కార్యక్రమాల్లో పాల్గని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జన్నేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులు అల్లేని నిఖిల్, సరోజాదేవి, అంబర్‌పేట నియోజకవర్గ అధ్యక్షుడు వెంకటేష్ తదితర నాయకులు సంఘీభావం తెలియజేశారు. మిర్చి రైతులకు కేంద్రం ఇస్తున్న రూ. 5వేలు ఏమూలకూ చాలవని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ. 5వేలు ఇవ్వాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ■

## రాబోయే ఎన్నికల కోసం కోట్లు పోగేస్తున్నారు!

రాబోయే ఎన్నికల్లో ఎలాగోలా గెలవటం కోసం వేల కోట్ల రూపాయలను అధికార పార్టీ పోగేస్తోందని, ప్రతిపక్ష పార్టీ కూడా డబ్బు సంచులతో సిద్ధమవుతోందని లోక్‌సత్తా పార్టీ హెచ్చరించింది. అవినీతిలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రెండవస్థానంలో ఉందంటే, కొత్త రాష్ట్రాన్ని ఎటు తీసుకెళ్తున్నారో ప్రజలు ఆలోచించాలని పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డా॥ పట్టాభిరామయ్య అన్నారు. అవినీతి విషయంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య తేడా ఏమీ లేదని, ఒకరు పెనం అయితే, ఇంకొకరు పొయ్యి అన్నారు. వీరి ఓట్ల కొనుగోలును డీమానిటేజేషన్ (పెద్ద నోట్ల రద్దు) ఏమాత్రం ఆపలేదని, గుడివాడలో 2,000 ఓట్లు ఉన్న ఒక మునిసిపల్ వార్డుకు జరిగిన ఉప ఎన్నికలో తెదేపా, వైకాపా రూ. 4కోట్లు ఖర్చు పెట్టాయన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటుకు రూ. 5,000 ఇచ్చయినా గెలవాలనుకుంటున్న అధికార, ప్రతిపక్ష పార్టీలను అడ్డుకోకపోతే.. వారిద్దరిలో ఎవరు గెలిచినా ఆంధ్రప్రదేశ్‌ను అయినకాడికి అమ్మేసుకుంటారన్నారు. విజయవాడలో జరిగిన లోక్‌సత్తా పార్టీ జిల్లా నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగేంద్రబాబు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఎన్నికలకు లోక్‌సత్తా పార్టీ కేవలం విరామం ప్రకటించింది తప్ప, ముగింపు పలకలేదని పట్టాభిరామయ్య ఈ సందర్భంగా అన్నారు. కొందరు నాయకులు ఉద్దేశపూర్వకంగా తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. 2014 ఎన్నికలలో ఓట్లు, సీట్లు రాకపోయినా లోక్‌సత్తాపార్టీ ఉండాల్సిందేనని ప్రజలలో 95శాతానికి పైగా కోరుకుంటున్నారని, అలాంటి గర్వించదగ్గ ఎజెండా, రాజకీయ సంస్కృతి తమ పార్టీ సొంతమని అన్నారు. ప్రజల్లో ఉన్న విశ్వసనీయతకు



తగ్గట్టు రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నేతృత్వంలో సంస్థాగత నిర్మాణానికి వీలైనంత కృషి చేస్తున్నామన్నారు. లోక్‌సత్తా పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు చెన్నుపాటి వజీర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలలో తెదేపా, వైకాపా కాకుండా వేరే పార్టీలు లేకుండా చేయటానికి దాడులు చేస్తున్నారన్నారు. నానారకాలుగా హింసిస్తున్నారన్నారు. డబ్బు, కుల రాజకీయాలతో ఎల్లకాలం ప్రజల్ని మోసం చేయలేరన్నారు. ఆంధ్రప్రదేశ్ కొత్తగా ఏర్పడింది కాబట్టి చాలా సహనంతో వ్యవహరిస్తూ ప్రభుత్వానికి సహకరిస్తూ వచ్చామని, జరుగుతున్న అవినీతిని, కేంద్రీకృత పాలనని, వంశపారంపర్య రాజకీయాలను, రైతు వ్యతిరేక విధానాలను చూశాక పోరాటం తప్పదనే లోక్‌సత్తా భావిస్తోందన్నారు. రాష్ట్రంలో రాజకీయం తీరుని మార్చి సరైన విద్య, ఆరోగ్యం, యువతకు ఉపాధి, రైతుకు ఆదాయం, అవినీతిలేని పాలన అందించే శక్తి లోక్‌సత్తా ఎజెండాకు మాత్రమే ఉందని, పార్టీ నేతలంతా జిల్లాలవారీగా బలోపేతమై కృషి చేస్తే లోక్‌సత్తాదే విజయమన్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు టీఎన్‌రావు, విజయవాడ నగర అధ్యక్షుడు బి.అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ■




# ఇంగ్లండ్ తెలుగు వైద్యుల రీయూనియన్‌లో జేపీ

బ్రిటన్‌లో పనిచేస్తున్న తెలుగు రాష్ట్రాల వైద్యులు ఇంగ్లండ్‌లోని డావెంట్రీలో నిర్వహించిన ఏఎంజీఆర్ (ఆంధ్రా మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీయూనియన్) - 2017లో లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.




వివిధ విభాగాలలో నిపుణులైన వైద్యులు ఉన్నత ప్రమాణాల పత్రాలను సమర్పించే ఈ కార్యక్రమంలో .. జేపీ ప్రధానంగా 'జేబులో నుంచి ఖర్చు లేకుండా భారతదేశంలో అందరికీ నాణ్యమైన వైద్యసేవలు అందించటం' గురించే అభిప్రాయాలను పంచుకున్నారు.


అందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని అందించే బ్రిటన్ ఎన్‌హెచ్‌ఎస్ (జాతీయ ఆరోగ్య పథకం) బాటలోనే... కేవలం జాతీయాదాయంలో 2-3 శాతం ఖర్చుతో భారత్‌లో 'అందరికీ అందుబాటులో ఆరోగ్యం' విధానాన్ని లోక్‌సత్తా రూపొందించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేత అమలు చేయించటం కోసం కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఎన్‌హెచ్‌ఎస్‌లో పలువురు భారతీయ వైద్యులు సేవలందిస్తున్నందున, బ్రెగ్జిట్ నేపథ్యంలో వారి అభిప్రాయాలను జేపీ తెలుసుకున్నారు.

అలాగే, భారత్‌లో వైద్యులకు - ప్రజలకు మధ్య అపనమ్మకాన్ని తొలగించి వైద్య సేవలను చౌకగా, మెరుగ్గా మార్చేందుకు లోక్‌సత్తా ఇటీవల చేపట్టిన కార్యక్రమంపై కూడా వారితో చర్చించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 31 ఏళ్ల క్రితం ఏఎంజీఆర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సేవావిభాగం ద్వారా ఏఎంజీఆర్ సభ్యులు పలు గ్రామాలు, పట్టణాలలో స్థానిక వైద్యసేవల్ని మెరుగుపరుస్తుంటారు. ఏఎంజీఆర్ 2017 సాంస్కృతిక కార్యక్రమాలలో... ఎన్నారై డాక్టర్ల పిల్లల్లో తెలుగు మాట్లాడే అలవాటును పెంచేందుకు ప్రత్యేకించి పోటీలను ఏర్పాటు చేశారు.

Posting Date 07-06-2017

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2016-18 Published on June1st, 2017




| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad